thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 213 | జగిత్యాల మంగళవారం 17 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

సచిన్‌తో గల్లీ క్రికెట్ ఆడిన బ్రిటన్ రాజదంపతులు!



11



చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్ని ప్రమాదం!

- ఖాళీ రైలు బోగీల్లో ఒక్కసారిగా చెలరేగిన అగ్ని
- 5, 6 ప్లాట్‌ఫారాల మధ్య నిలిపిన కోచ్‌లకు మంటలు
- ఆకాశాన్ని కమ్మేసిన దట్టమైన పొగలు
- భయాందోళనకు గురైన ప్రయాణికులు
- రైల్వే సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- ప్రాణనష్టం లేదని వెల్లడించిన అధికారులు

హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్టేషన్‌లోని 5, 6 నంబరు ప్లాట్‌ఫారాల మధ్య నిలిపి ఉంచిన ఖాళీ రైలు బోగీల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పక్కనున్న ఇతర బోగీలకు వ్యాపించడంతో దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేశాయి. ఈ ఘటనతో స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బోగీల నుంచి మంటలు, పొగలు రావడాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంటలు ఇతర రైళ్లకు, స్టేషన్ ఆస్తులకు వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.

వివరాలు 2వ పేజీలో



గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు

- సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం
- పద్మశాలి, ముదిరాజ్, మున్నూరు కాపులకు రెండు స్థానాలు?
- మూడో స్థానం ఎవరికి దక్కుతుందనే దానిపై ఉత్కంఠ

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): గవర్నర్ కోటాలో ఖాళీ అయిన మూడు ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాజిక, రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేయాలని భావిస్తోంది. రాష్ట్ర నాయకులతో పాటు ఢిల్లీలోని పార్టీ పెద్దలతోనూ సంప్రదింపులు జరుపుతోంది. త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు, ఖైరతాబాద్ ఉప ఎన్నికను కూడా పరిగణనలోకి తీసుకుని పార్టీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించే నాయకులకు అవకాశం కల్పించాలనే ఆలోచనలో ఉంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కొనసాగిన గోరేటి వెంకన్న, బొగ్గారపు దయానంద్, బస్వరాజు సారయ్యల పదవీకాలం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రతిపక్ష నేత

మిగతా 2 లో



ఆధునిక యుద్ధంలో ఎవరూ సురక్షితం కాదు

- ఏఐ, డ్రోన్లతో మారుతున్న యుద్ధరంగ స్వరూపం
- రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి
- ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్‌లో రక్షణ దళాల అధిపతి కీలక వ్యాఖ్యలు

4

గూఢచర్యంలో హనీట్రాప్ భాగమే..

- వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ కీలక వ్యాఖ్యలు!





పించన్ల పంపిణీలో అరుదైన దృశ్యం

- ఒకే వేదికపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు
- ఊరూ వాడా ఉత్సాహంగా 'చేయూత' నూతన పించన్ల పంపిణీ

4

శూన్య హస్తాలు.. శుష్కప్రియాలు

- ఇదీ రేవంత్ నిర్వాకం
- తప్పచేసి మాపై నిందలా?
- మీరు చేసిన తప్పను సరిదిద్దాం
- మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట కమీషన్లు దండుకున్నదీ మీరే
- కృష్ణాజలాల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తి విఫలం
- కాంగ్రెస్ వైఫల్యంతో 25లక్షల ఎకరాల్లో ఎండిన పంట
- అకాల వర్షం నష్టాలకు ఇంతవరకు సాయం అందలేదు
- మాజీ మంత్రి హరీష్ రావు



3

కరీంనగర్ సీపీ వివాదం

- పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ
- మినీ మేడారం జాతరలో సీపీపై అనుచిత వ్యాఖ్యల కేసు

3



మినీ మేడారం జాతర సందర్భంగా జరిగిన వివాదానికి సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది.



గుండు వాణి అక్రమాస్తుల గుట్టురట్టు!

- టౌన్ ప్లానింగ్ అధికారి ఆస్తులపై ఏసీబీ దాడులు
- ఒకేసారి 28 ప్రాంతాల్లో విస్తృత సోదాలు
- హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లో ఎనిమిది స్థలాల గుర్తింపు
- గతంలో రూ.75 వేల లంచం కేసులో అరెస్టు
- బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ తనిఖీలు

2

ఓట్ చోర్.. గద్దీ ఛోడ్



- భారత్ సమ్మిట్‌లో విదేశీ నేత వ్యాఖ్యలపై దుమారం!
- ఇటలీ నేత వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్
- జోక్యం వీసా నిబంధనల ఉల్లంఘనేనని వెల్లడి
- రాహుల్ గాంధీపై బీజేపీ, బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు

.. వివరాలు 4లో

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు

- సుప్రీంకోర్టుకు రాహుల్!
- ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలంటూ ఆరోపణలు

4



ప్రపంచానికి భారత్ సరికొత్త మార్గం చూపింది!

- భారత్‌పై బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ ప్రశంసలు
- స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ పురోగతి అద్భుతమని కితాబు

4





చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం!

ఖాళీ రైలు బోగీల్లో ఒక్కసారిగా చెలరేగిన అగ్ని

5, 6 ప్లాట్‌ఫారాల మధ్య నిలిపిన కోచ్‌లకు మంటలు

రైల్వే సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

ప్రాణనష్టం లేదని వెల్లడించిన అధికారులు

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): చర్లపల్లి రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 5, 6 మధ్య నిలిపి ఉంచిన ఓ ఖాళీ రైలు బోగీల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పక్కనున్న ఇతర బోగీలకు కూడా వ్యాపించడంతో దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేశాయి. ఈ ఘటనతో స్టేషన్ ప్రాంగణంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బోగీల నుంచి మంటలు, పొగలు రావడాన్ని గమనించిన రైల్వే స్టేషన్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ప్రమాద తీవ్రత పెరగకముందే ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రయాణికులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంటలు ఇతర రైళ్లకు, స్టేషన్ ఆస్తులకు వ్యాపించకుండా ఉండేందుకు తక్షణమే విద్యుత్ సరఫరాను నిలిపివేసి, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రైల్వే పోలీసులు, స్థానిక ఉన్నతాధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ప్రమాద సమయంలో రైలు కోచ్‌లు పూర్తిగా ఖాళీగా ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం సంభవించలేదని రైల్వే అధికారులు స్పష్టం చేశారు. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

టీపీవో గుండు వాణి అక్రమాస్తుల గుట్టురట్టు!

ఒకేసారి 28 ప్రాంతాల్లో విస్తృత సోదాలు

హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లో ఎనిమిది స్థలాల గుర్తింపు

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై మొయినాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి గుండు వాణిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం నుంచి అత్తాపూర్‌లోని ఆమె నివాసంతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 28 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ముమ్మర తనిఖీలు చేపట్టాయి. గత సెప్టెంబర్ 30న మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో జరిగిన లంచం వ్యవహారంలో గుండు వాణి ఏసీబీకి పట్టుబడ్డారు. ఓ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు ఆమె రూ.75 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వాణి తరఫున సీనియర్ అసిస్టెంట్ యలమోని సుదర్శన్ ఆ నగదును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. లంచం కేసు తదుపరి విచారణలో భాగంగా వాణి అక్రమాస్తులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ప్రాథమిక దర్యాప్తులో హైదరాబాద్‌లో నాలుగు, మహబూబ్ నగర్‌లో మరో నాలుగు ప్రాంతాల్లో విలువైన స్థలాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తులకు సంబంధించి వారం రోజుల క్రితమే ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. వాణి నివాసంతోపాటు బంధువులు, స్నేహితుల ఇళ్లలో మొత్తం 28 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని, తనిఖీలు పూర్తయిన తర్వాత స్వాధీనం చేసుకున్న ఆస్తులు, నగదు, ఇతర పూర్తి వివరాలను వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఖేలో ఇండియాకు విస్తృత ప్రచారం కల్పించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి కూడా అంతర్జాలం ద్వారా సమావేశంలో పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌తోపాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న ఈ పోటీలకు సుమారు ఎనిమిది వేల మంది క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని సీఎస్ సూచించారు. ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ప్రచార ఫలకాలు ఏర్పాటు చేయడంతోపాటు క్రీడల చిహ్నం, గుర్తులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, కాజీపేట రైల్వే స్టేషన్లు, ప్రధాన బస్టాండ్లలో ప్రత్యేక ప్రచార ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్రీడల ప్రాధాన్యాన్ని తెలియజేసేలా జ్యోతి ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. పోటీలు జరిగే వేదికల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధం చేయడంతోపాటు క్రీడాకారులకు నాణ్యమైన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో క్రీడా పోటీలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు

మొదటి పేజీ తరువాయి

మధుసూదనాచారి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఖాళీ అయిన ఈ స్థానాల్లో కొత్తవారి నియామకంపై ఇప్పుడు పార్టీలో విస్తృత చర్చ సాగుతోంది. అధికారంలోకి రావడానికి కృషి చేసిన పలువురు నాయకులు ఈసారి తమకు అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నారు.

బీసీలకు ప్రాధాన్యంపై సీఎం హామీ

ప్రభుత్వానికి మరో రెండేళ్ల పదవీకాలం మాత్రమే మిగిలి ఉండటంతో, వచ్చే ఎన్నికలకు ముందే సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ కూడా ఈ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడంపై దృష్టి పెట్టింది. ఇటీవల జరిగిన రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారికే అవకాశం కల్పించడంతో బీసీల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించారు. సిరిసిల్ల, రవీంద్రభారతి సభల్లో ఈ విషయాన్ని వెల్లడించారు. మూడు స్థానాల్లో రెండింటిని పద్మశాలి,



ముదిరాజ్, మున్నూరు కాపు సామాజిక వర్గాలకు కేటాయించే ఆలోచనను కూడా బయటపెట్టారు. పద్మశాలి సామాజిక వర్గం నుంచి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె పవిత్ర వాణి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈరవత్రి అనిల్, పున్నా కైలాష్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాత ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించే ప్రయత్నాల్లో భాగంగా గుండు సుధారాణికి వరంగల్ కాకతీయ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి నీలం మధు పేరు పరిశీలనలో ముందున్నట్లు తెలుస్తోంది. మున్నూరు కాపు వర్గం నుంచి ముఖ్యమంత్రికి సన్నిహితుడిగా పేరున్న కరీంనగర్ లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేశంకు అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరితో పాటు చరణ్ కౌశిక్ యాదవ్, లోకేశ్ యాదవ్, చనగాని దయాకర్, నేరెళ్ల శారద పేర్లు కూడా ఆశావహుల జాబితాలో ఉన్నాయి. మిగిలిన మూడో ఎమ్మెల్సీ స్థానాన్ని ఏ సామాజిక వర్గానికి కేటాయించాలనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. బీసీలకే మరో అవకాశం ఇస్తారా? లేక ఎస్సీ, ఓసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఓసీల్లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి కేటాయిస్తే హర్కర వేణుగోపాల్‌రావు పేరు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎస్సీలకు అవకాశం కల్పిస్తే మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, దొమ్మాటి సాంబయ్య పేర్లు వినిపిస్తున్నాయి. సామాజిక సమతుల్యతతో పాటు రానున్న ఎన్నికల్లో పార్టీకి కలిగే ప్రయోజనాలను బేరీజు వేసిన తర్వాతే కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

విద్యుత్ సరఫరా వ్యవస్థ సమర్థ నిర్వహణ

- ఎల్‌నినో ప్రభావం ఉన్నా సరఫరాలో అంతరాయం ఉండొద్దు
- రబీలోనూ రైతులు, అన్ని వర్గాల వినియోగదారులకు నిరంతరాయంగా సరఫరా
- విద్యుత్తు ఉన్నతాధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు) : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విద్యుత్ డిమాండ్ చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకున్నా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడంలో విద్యుత్ సంస్థలు సమర్థంగా పనిచేస్తున్నాయని అభినందించారు. రానున్న రబీ సీజన్‌లోనూ ఇదే పనితీరును కొనసాగిస్తూ రైతులు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో ఇంధన శాఖ ఉన్నతాధికారులు, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో విద్యుత్ సరఫరా పరిస్థితిపై సోమవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సరఫరా నిర్వహణ, మౌలిక సదుపాయాల విస్తరణ, రానున్న



రబీ సీజన్‌కు విద్యుత్ సంస్థల సన్నద్ధతపై చర్చించారు. అక్టోబర్ 16న రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు చేరుకుని చరిత్రాత్మక గరిష్ఠ స్థాయిని నమోదు చేసిందని గుర్తు చేశారు. వరుసగా రెండో రోజు కూడా 20,003 మెగావాట్ల స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ విద్యుత్ సంస్థలు సమర్థంగా సరఫరా చేశాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏటా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని, గత ఏడాది నవంబర్ 16న 8,522 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ డిమాండ్ ఈ ఏడాది అదే తేదీన 12,802 మెగావాట్లకు చేరిందని వివరించారు. ఇందులో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 8,859 మెగావాట్లు, ఎన్పీడీసీఎల్ పరిధిలో 3,595 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైందన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జల విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 4,000 మెగావాట్ల కొరత ఏర్పడినప్పటికీ ఖరీఫ్ లో రైతులతోపాటు అన్ని వర్గాల వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడం అభినందనీయమన్నారు. ఇదేవిధంగా రబీ సీజన్‌లోనూ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మరోవైపు పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా, మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు వివరించారు. దావూద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేట ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రెండు 33/11 కేవీ సబ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వీటి ద్వారా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంతోపాటు సరఫరా నాణ్యత, విశ్వసనీయత మెరుగుపడుతుందని వెల్లడించారు. రబీ సీజన్‌లో దీర్ఘకాలిక పొడి వాతావరణం ఉండే అవకాశాలున్నందున విద్యుత్ డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల సంభవించే పరిస్థితులను ముందుగానే అంచనా వేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. డిమాండ్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన విద్యుత్‌ను సమకూర్చుకోవాలని, ఏ ఒక్క వర్గం వినియోగదారుడికీ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి.పాటిల్, డైరెక్టర్లు శివాజీ, చక్రపాణి, నరసింహ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్రమ అండాల సేకరణ కేసులో దర్యాప్తు ముమ్మరం

- చంచల్‌గూడ జైలుకు నిందితుల తరలింపు
- పరారీలో పలువురు ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకులు
- ఏడు కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలపై అనుమానాలు
- నకిలీ ఆధార్‌లతో యువతుల నుంచి పదేపదే అండాల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): నగరంలో కలకలం రేపిన అక్రమ అండాల సేకరణ వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు వేగం పెంచారు. ఈ అక్రమ దందాతో సంబంధం ఉన్న పలువురు నిందితులను ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు, కోర్టు అనుమతితో విచారించిన అనంతరం ఆదివారం మధ్యాహ్నం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న కీలక వ్యక్తుల వివరాలు వెలుగులోకి రావడంతో పలువురు ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకులను కూడా అరెస్టు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసుల తనిఖీలు ముమ్మరం కావడంతో ఈ అక్రమ వ్యవహారంలో సంబంధం ఉన్న పలువురు ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకులు అందుబాటులో లేకుండా పోయారు. వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. నగరంలోని ఏడు ఐవీఎఫ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగినట్లు ప్రాథమిక విచారణలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. వైద్యఆరోగ్య శాఖ అధికారులతో కలిసి టాస్క్ ఫోర్స్ బృందాలు ఆయా కేంద్రాల రికార్డులను పరిశీలిస్తున్నాయి. దర్యాప్తులో అండాల సేకరణ వెనుక సాగిన అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. సంతానం లేని దంపతుల అవసరాలను



ఆసరాగా చేసుకున్న ఏజెంట్లు వివిధ రాష్ట్రాలకు చెందిన పేద యువతులను హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అండాల దాతల రక్తవర్గం, మతం, కులం, చర్మం రంగు, ఎత్తు తదితర వివరాల ఆధారంగా సేకరణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఒక్కో యువతికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లిస్తామని ఆశ చూపినట్లు సమాచారం. అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ ఒకే యువతి నుంచి పలుమార్లు అండాలు సేకరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇందుకోసం నకిలీ ఆధార్ కార్డులను సైతం రూపొందించినట్లు గుర్తించారు. మరోవైపు సేకరించిన అండాల నాణ్యత ఆశించిన స్థాయిలో లేదనే కారణంతో, సంబంధిత ప్రక్రియలో భాగంగా గర్భం దాల్చిన మహిళలకు బలవంతంగా అబార్షన్లు చేయించారనే తీవ్ర ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. మహిళల ఆరోగ్యం, ప్రాణాలకు ముప్పు కలిగించేలా సాగిన ఈ అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే అరెస్టయిన నిందితుల విచారణతో పాటు పరారీలో ఉన్న ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకుల కోసం గాలింపు కొనసాగుతోంది. వారి అరెస్టుతో ఈ అక్రమ అండాల సేకరణ వెనుక ఉన్న మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

కరీంనగర్ సీపీ వివాదం

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): మినీ మేడారం జాతర సందర్భంగా జరిగిన వివాదానికి సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వాయిస్ శాంపిల్ ఇవ్వాలంటూ పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో దర్యాప్తు కోసం కౌశిక్‌రెడ్డి తన వాయిస్ శాంపిల్‌ను పోలీసులకు అందించాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లా వీణవంక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు విచారణలో భాగంగా వాయిస్ శాంపిల్ ఇవ్వాలని పోలీసులు కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే తాను కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను దూషించలేదని, ఉద్దేశపూర్వకంగా చేసిన ఫిర్యాదు ఆధారంగానే కేసు నమోదు చేశారని ఆయన కోర్టును ఆశ్రయించారు. పోలీసుల నోటీసులను రద్దు చేయాలని కోరారు. ఈ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఈ ఏడాది జనవరి చివరిలో వీణవంకలో నిర్వహించిన మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా ఈ వివాదం చోటుచేసుకుంది. జాతరకు పరిమిత సంఖ్యలో వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని పోలీసులు స్పష్టం చేయగా, కౌశిక్‌రెడ్డి భారీ కాన్వాయ్‌తో రావడంతో వివాదం మొదలైంది. తన కుటుంబ సభ్యులతో కలిసి రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగిందని, కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై మతపరమైన వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. జాతర సందర్భంగా పోలీసుల సూచనల మేరకు నాలుగు వాహనాలకు అనుమతి ఇవ్వడంతో కౌశిక్‌రెడ్డి గద్దెల వద్దకు చేరుకున్నారు. అక్కడ దళిత మహిళా సర్పంచ్‌తో కొబ్బరికాయ కొట్టించాలని ఆయన పట్టుబట్టినట్లు సమాచారం. స్థానిక ట్రస్టీ వర్గాలతో విభేదాల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఎమ్మెల్యేను, ఆయన కుటుంబ సభ్యులను అక్కడి నుంచి తరలించారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 126(2), 132, 196, 299 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు, జాతరలో మొక్కులు చెల్లించుకోకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు గతంలో ఆరోపించారు. తాజా హైకోర్టు తీర్పుతో ఈ కేసు దర్యాప్తులో వాయిస్ శాంపిల్ సేకరణకు మార్గం సుగమమైంది.

శూన్య హస్తాలు.. శుష్కప్రియాలు

- ఇదీ రేవంత్ నిర్వాకం
- తప్పుచేసి మాపై నిందలా?
- మీరు చేసిన తప్పును సరిదిద్దాం
- మొబిలైజేషన్ అడ్వాన్స పేరిట కమీషన్లు దండుకున్నదీ మీరే
- కృష్ణాజలాల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తి విఫలం
- కాంగ్రెస్ వైఫల్యంతో 25లక్షల ఎకరాల్లో ఎండిన పంట
- అకాల వర్షం నష్టాలకు ఇంత వరకు సాయం అందలేదు
- మాజీ మంత్రి హరీష్ రావు



సిద్దిపేట, నవంబర్ 16 (చురకలు): నాడు ఏడేళ్లు, నేడు మూడేళ్లు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని, కొత్తగా ఒక్క ప్రాజెక్టు కట్టలేదని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శూన్య హస్తాలు, శుష్క ప్రియాలు తప్ప రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు చేసింది గుండు సున్నా అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద జల్లడం మాని, తాము నిర్మించిన ప్రాజెక్టుల చివరి దశ పనులను పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధిస్తూ బహిరంగ లేఖ విడుదల చేశారు. గతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 2, 2024న సిద్దిపేటకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. కొమురవెల్లి మల్లన్న సాక్షిగా పంద్రాగస్టు లోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చినా, ఇప్పటికీ అమలు కాలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలోనూ, తన సిద్దిపేట నియోజకవర్గంలోనూ వేలాది మందికి రుణమాఫీ కాలేదన్నారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పనందుకే రాష్ట్రానికి అరిష్టం కలుగుతోందని, రేవంత్ పాపం వల్లనే రాష్ట్రానికి కరువు వచ్చిందని ఎద్దేవా చేశారు. రెండోసారి సిద్దిపేటకు వచ్చినప్పుడు 45 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఇస్తామని హామీ ఇచ్చి 230 రోజులు గడిచినా ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని, రైతు బంధు, రుణమాఫీ పూర్తి చేసిన తర్వాతే సిద్దిపేటకు రావాలని, అప్పుడు తానే స్వయంగా బొకే ఇచ్చి స్వాగతం పలుకుతానని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించడమే కాకుండా, ఫిబ్రవరి 29, 2024న దాన్ని రద్దు చేశారని హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట ప్రాంతానికి మంజూరైన ఔటర్ రింగ్ రోడ్డు, బీఎస్సీ అగ్రికల్చర్ కాలేజీ, శిల్పారామం, ఎస్సీ మహిళా రెసిడెన్షియల్, స్పోర్ట్స్ స్టేడియం, ఆడిటోరియం వంటి వివిధ పనులకు సంబంధించిన రూ. 1070 కోట్ల నిధులను నిలిపివేసి, పనులను రద్దు చేశారని ఆరోపించారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్ల విషయంలోనూ సిద్దిపేట పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యం కారణంగా వానాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని, అకాల వర్షాలు, వడగళ్ల వాన వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాల్లో అతి తక్కువ నీటిని ఎత్తిపోశారని, కృష్ణా జలాల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమై చేతగానితనాన్ని దాచుకునేందుకు తమపై బురద చల్లుతోందని ధ్వజమెత్తారు. మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కింద కాలువల తవ్వకం నిలిపివేయడంతో హుస్నాబాద్, చేర్యాల ప్రాంతాలకు తీవ్ర అన్యా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులు ఆగిపోతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా నిలిపివేసిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, సిద్దిపేట ప్రజల ఆత్మగౌరవంతో చెలగాటం ఆడటం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

డేటింగ్ యాప్‌తో పరిచయం.. మత్తుమందు ఇచ్చి దోపిడీ

- కుషాయిగూడలో ఐదుగురు సభ్యుల ముఠా అరెస్ట్
- గే డేటింగ్ యాప్ ద్వారా బాధితులకు వల
- మత్తులోకి జారగానే నగలు, నగదు అపహరణ
- 35 తులాల బంగారం స్వాధీనం
- వ్యక్తిగత వీడియోలతో బెదిరించి డబ్బుల వసూళ్లు



హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): డేటింగ్ యాప్‌ను ఆసరాగా చేసుకుని అమాయకులను మోసగించి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేశారు. గే డేటింగ్ యాప్ ద్వారా పరిచయాలు పెంచుకుని, బాధితులను ఏకాంత ప్రదేశాలకు రప్పించి మత్తుమందు ఇచ్చి దోచుకుంటున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుల నుంచి సుమారు 35 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గే డేటింగ్ యాప్‌లో నకిలీ ఖాతాలు సృష్టించి పలువురితో పరిచయాలు పెంచుకునేవారు. కొంతకాలం నమ్మకం కలిగించిన తర్వాత నేరుగా కలుద్దామంటూ ప్రైవేట్ గదులకు రప్పించేవారు. అక్కడికి చేరుకున్న బాధితులకు మత్తు కలిగించే పదార్థాలు కలిపిన పానీయాలు లేదా ఇతర పదార్థాలు ఇచ్చేవారు. బాధితులు స్పృహ కోల్పోయిన తర్వాత వారి వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను అపహరించి అక్కడి నుంచి వెళ్లిపోయేవారు. ఈ విధంగా పలువురిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం సుమారు 35 తులాలు ఉన్నట్లు వెల్లడించారు. బాధితుల వద్ద నగదు, నగలు లభించిన సందర్భాల్లో మరో మార్గాన్ని ఎంచుకునేవారు. వారి వ్యక్తిగత వీడియోలను మొబైల్ ఫోన్లలో చిత్రీకరించి, వాటిని బయటపెడతామంటూ బెదిరించేవారు. పరువు పోతుందనే భయాన్ని ఆసరాగా చేసుకుని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారని పోలీసుల విచారణలో వెల్లడైంది. కేసు నమోదు చేసిన కుషాయిగూడ పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠా చేతిలో ఇంకా ఎంతమంది మోసపోయారనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయమైన గుర్తుతెలియని వ్యక్తులను నేరుగా కలిసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

విదేశీ నేతపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి!

- భారత్ సమ్మిట్‌లో రాజకీయ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం
- ఇటలీ నేత జియాకోమో ఫిలిబెక్‌పై ఎఫ్ఆర్ఆర్‌వోకు ఫిర్యాదు
- వీసా నిబంధనల ఉల్లంఘనపై సమగ్ర విచారణ జరపాలి
- డీజీపీకి ఫిర్యాదు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో భారత అంతర్గత రాజకీయాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఇటలీ రాజకీయ నాయకుడు, పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్ ప్రధాన కార్యదర్శి జియాకోమో ఫిలిబెక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది. సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం శంషాబాద్‌లోని విదేశీయుల ప్రాంతీయ నమోదు కార్యాలయం (ఎఫ్ఆర్ఆర్‌వో) అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 14న జరిగిన భారత్ సమ్మిట్‌లో ఫిలిబెక్ 'ఓట్ చోర్.. గద్దీ చోడ్' అంటూ భారత ఎన్నికల రాజకీయాలను ప్రస్తావించడం అభ్యంతరకరమని పేర్కొంది. ఆయన ఏ వీసాపై భారత్‌కు వచ్చారు, పర్యటన ఉద్దేశం ఏమిటి, వీసా నిబంధనలు పాటించారా అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరింది. విదేశీ రాజకీయ నాయకుడు భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వీసా నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందనే అనుమానాన్ని బీజేపీ వ్యక్తం చేసింది. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025లోని సంబంధిత నిబంధనల ప్రకారం విచారణ జరిపి ఉల్లంఘనలు నిర్ధారణైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సదస్సు నిర్వహణకు కేంద్ర హోం, విదేశాంగ శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందారా, విదేశీ ప్రతినిధులకు పంపిన ఆహ్వానాలు, వీసా దరఖాస్తులు, ఇతర పత్రాల్లో పేర్కొన్న వివరాలు వాస్తవాలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాలను పరిశీలించాలని కోరింది. అనంతరం బీజేపీ ప్రతినిధి బృందం రాష్ట్ర డీజీపీని కలిసి ఫిలిబెక్, రాహుల్ గాంధీ, సదస్సు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ విదేశీ నేత భారత ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యాఖ్యానించారని ఆరోపించారు. వేదికపై రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నప్పటికీ ఆ వ్యాఖ్యలను అడ్డుకోలేదని విమర్శించారు. సదస్సు నిర్వహణలో భాగస్వాములైన సంస్థల పాత్రపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విదేశీ ప్రతినిధుల వీసాల విషయంలోనూ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 115 మంది వీసాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొన్నారు. ఫిర్యాదుపై న్యాయ సలహా తీసుకుని చట్టప్రకారం చర్యలు పరిశీలిస్తామని డీజీపీ తెలిపినట్లు రామచందర్‌రావు వెల్లడించారు. సంబంధిత వ్యక్తులు, సంస్థలపై చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, వీరేందర్‌గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య, న్యాయ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.





2014కు ముందు ఇండ్ల పథకం లబ్ధిదారులకు ఊరట

పట్టా/పొజిషన్ సర్టిఫికెట్ల వాపస్‌కు ఆదేశాలు

7లక్షల మందికి ప్రయోజనం

దశాబ్దకాలపు నిరీక్షణకు తెరదించిన ప్రజా ప్రభుత్వం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): దశాబ్దాలుగా పేదలు కన్న సొంతింటి కలను సాకారం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇందిరమ్మ సహా వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు గతంలో జారీ చేసిన పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తిరిగి అందించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు పేదల సొంతింటిపై హక్కును మరింత భద్రం చేస్తూ, వారి కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఏడు లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దానికి పైగా లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి పట్టా సర్టిఫికెట్లు తిరిగి రాకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తనకు పలు విజ్ఞాపనలు వచ్చాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో 22-ఎ భూములపై సమీక్షలు జరుగుతున్న సమయంలో ఈ పట్టాలు తహసీల్దార్ కార్యాలయాల్లో భారీగా పేరుకుపోయి ఉన్నాయని ముఖ్యమంత్రి దృష్టికి రాగా, వెంటనే వాటిని పేదలకు వాపస్ చేయాలని ఆదేశించారని వెల్లడించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా, ప్రభుత్వం వద్ద ఉన్న లబ్ధిదారుల ఇండ్ల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తక్షణమే వెనక్కి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు మంత్రి స్పష్టం చేశారు. దశాబ్ద కాలపు సమస్యకు శాశ్వత పరిష్కారం:2014 కంటే ముందు అమలు చేసిన గృహ నిర్మాణ పథకాల్లో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సబ్సిడీ, లబ్ధిదారుల వాటాతో పాటు బ్యాంకు రుణం ద్వారా ఆర్థిక సహాయం అందించేవారని పొంగులేటి గుర్తుచేశారు. ఈ రుణాల కోసం లబ్ధిదారుల ఇండ్లకు చెందిన పట్టాలను ష్యూరిటీగా ఉంచుకునేవారని, రుణ వాయిదాలన్నింటినీ సక్రమంగా చెల్లించిన వారికి పట్టాలను తిరిగి ఇచ్చేవారని వివరించారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని నిలిపివేయడంతో వివిధ కారణాలతో లక్షలాది మంది లబ్ధిదారులకు వారి ఇండ్లకు సంబంధించిన పత్రాలను తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న పట్టాలన్నింటినీ లబ్ధిదారులకు వాపస్ చేయాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మహిళా భద్రత విభాగం డీజీగా డాక్టర్ సౌమ్య మిశ్రా

చారు సిన్హా నుంచి బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): తెలంగాణ మహిళా భద్రత విభాగం (ఉమెన్ సేఫ్టీ వింగ్) డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా డాక్టర్ సౌమ్య మిశ్రా బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో ఉన్న మహిళా భద్రత విభాగం కార్యాలయంలో ప్రస్తుత డీజీ చారు సిన్హా నుంచి ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అయిన డాక్టర్ సౌమ్య మిశ్రా మహిళలు, బాలికల భద్రత, రక్షణ, సాధికారతకు సంబంధించి రాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలకు నాయకత్వం వహించనున్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, బాధితులకు రక్షణ కల్పించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం వంటి అంశాలపై మహిళా భద్రత విభాగం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ప్రజలకు చేరువగా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు వివిధ ప్రభుత్వ విభాగాలు, సంబంధిత సంస్థల సమన్వయంతో మహిళల భద్రతకు చర్యలు చేపడుతోంది. మహిళలు, చిన్నారులకు సురక్షితమైన, సమానత్వంతో కూడిన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ విభాగం పనిచేస్తోంది. లింగ వివక్ష, మహిళలపై హింస వంటి సమస్యల నివారణకు ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత, లింగ సమానత్వంపై అవగాహన పెంపొందించడంపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతోంది. డాక్టర్ సౌమ్య నాయకత్వంలో ఇప్పటికే అమలవుతున్న కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజల్లోకి భద్రతా కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లేందుకు మహిళా భద్రత విభాగం కృషి చేయనుంది. మహిళలు, చిన్నారులు గౌరవంగా, భద్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవించే సమాజ నిర్మాణానికి తెలంగాణ పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.



ఆధునిక యుద్ధంలో ఎవరూ సురక్షితం కాదు

ఏఐ, డ్రోన్లతో మారుతున్న యుద్ధరంగ స్వరూపం

రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి


ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్‌లో రక్షణ దళాల అధిపతి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 16 (చురకలు): కాలంతో పాటు యుద్ధరంగ స్వరూపం పూర్తిగా మారిపోతోందని, ఆధునిక సాంకేతిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ తనను తాను మెరుగుపరుచుకుంటూ ఉండాలని రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఉపగ్రహ ఆధారిత నిఘా, డ్రోన్‌లు ఆధునిక యుద్ధ తంత్రాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ విస్తరిస్తున్న ఆధునిక యుద్ధ భూమిలో ఎవరూ సురక్షితంగా ఉండే అవకాశం లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. దిల్లీలో జరిగిన 'ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 3.0'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీడీఎస్ రాజా సుబ్రమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం యుద్ధ క్షేత్రం క్రమంగా విస్తరిస్తోందని తెలిపారు. గతంలో శత్రు దేశాలను ఓడించాలంటే కేవలం సైనికులను మాత్రమే లక్ష్యంగా చేసుకునేవారని, కానీ నేడు దేశాన్ని అన్ని రకాలుగా బలహీనపరిచేందుకు పరిశ్రమలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, విద్యుత్ కేంద్రాలు, చివరికి పౌర నివాస ప్రాంతాలపైనా దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శత్రువుల నుంచి ఇలాంటి బహుముఖ దాడులను ఎదుర్కోవాలంటే అత్యంత బలమైన రక్షణ వ్యవస్థలు కావాలని స్పష్టం చేశారు. ఆధునిక యుద్ధాల్లో ఖర్చుల నియంత్రణ ఎంతో కీలకమని జనరల్ రాజా సుబ్రమణి పేర్కొన్నారు. చాలా తక్కువ ధరతో తయారు చేసిన డ్రోన్లను కూల్చివేయడానికి మిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక క్షిపణులను ఉపయోగిస్తే.. ఆ దేశ యుద్ధ ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలహీనపడిపోతుందని హెచ్చరించారు. ఇందుకు ఉదాహరణగా.. ఇటీవల అమెరికా తన పేట్రియాట్ క్షిపణులను వేగంగా ఖాళీ చేయడాన్ని మనం చూశామని, వాటిని తిరిగి సమకూర్చుకోవడానికి అగ్రరాజ్యానికి అనేక ఏళ్లు పడుతుందని గుర్తుచేశారు. కాబట్టి అధునాతన ఆయుధాలతో పాటు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయ ఆయుధాలను, రక్షణ పరికరాలను స్వయంగా తయారు చేసుకోవడంపై దేశాలు దృష్టి పెట్టాలని సూచించారు. తమ ఆర్థిక, సైనిక బలాన్ని పటిష్టం చేసుకోవాలనుకునే దేశాలకు కృత్రిమ మేధ (ఏఐ), డేటా, కీలక ఖనిజాలపై నియంత్రణ చాలా అవసరమని సీడీఎస్ స్పష్టం చేశారు. వీటిపై పట్టు సాధించేందుకు ప్రపంచ దేశాల మధ్య పోటీ రోజురోజుకూ పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం సాంకేతిక రంగంలో అగ్రగామిగా ఉన్న అమెరికా, చైనాల మధ్య ఈ ఆధిపత్య పోరు మరింత స్పష్టంగా కనిపిస్తోందని, అదే సమయంలో ఇతర దేశాలు కూడా ఆ అంతరాన్ని వేగంగా తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. సుదీర్ఘకాలం కొనసాగే ఎలాంటి సంఘర్షణలనైనా ఎదుర్కొనేందుకు దేశాలు తమ స్వదేశీ తయారీ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

గూఢచర్యంలో హనీట్రాప్ భాగమే..

వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ కీలక వ్యాఖ్యలు!

సాంకేతికంగా లొంగదీసుకోలేకే శత్రు దేశాలు సోషల్ మీడియా వేదికగా 'వలపు వలలు' విసురుతున్నాయని వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 16 (చురకలు): భారత మిలటరీ వ్యవస్థ, దాని పరిశోధన విభాగాలు విదేశీ సైబర్ దాడులకు లొంగనంత అత్యంత సురక్షితంగా ఉన్నాయని, అందుకే విదేశీ ఇంటెలిజెన్స్ సంస్థలు సాంకేతికంగా దెబ్బతీయలేక 'హనీట్రాప్' (వలపు వల) మార్గాన్ని ఎంచుకున్నాయని భారత వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ పేర్కొన్నారు. రక్షణ రంగంలో హనీట్రాప్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా అశుతోశ్ దీక్షిత్ మాట్లాడుతూ.. "మిలటరీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ అనేది పబ్లిక్ నెట్‌వర్క్ నుంచి పూర్తిగా వేరుగా ఉంటుంది. దానిపై ఎలాంటి సైబర్ దాడికి పాల్పడడం అసాధ్యం. అందుకే విదేశీ ఇంటెలిజెన్స్.. సాంకేతికంగా వ్యవస్థను దెబ్బతీయలేక, మనుషులను టార్గెట్ చేసుకునే మార్గాన్ని ఎంచుకుంది. పబ్లిక్ సెక్టార్ లాబొరేటరీ సిబ్బంది, ప్రైవేట్ సెక్టార్‌లోని డిఫెన్స్ కాంట్రాక్టర్లను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా ప్రేమ పేరుతో ట్రాప్ చేస్తున్నారు" అని తెలిపారు. వలపు వలలు అనేవి ఇంటెలిజెన్స్ గూఢచర్యంలో కేవలం ఒక చిన్న భాగం మాత్రమేనని, లోన్స్ పేరుతో, మార్కెట్ ఆశల పేరుతో ఇలా అనేక మార్గాల్లో ఈ కార్యకలాపాలు సాగుతున్నాయని ఆయన వివరించారు. మిలటరీ నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులు సాధ్యం కానప్పటికీ, వ్యవస్థ లోపలి వ్యక్తుల ద్వారా ప్రమాదం పొంచి ఉంటుందని, అందుకే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేటప్పుడే ఇలాంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. గత కొంతకాలంగా రక్షణ రంగాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి హనీట్రాప్ దాడులు ఎక్కువవుతున్నాయి. సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడానికి తన సహోద్యోగి మొబైల్‌లో మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేశారన్న ఆరోపణలపై ఇటీవల ఢిల్లీలో ఓ డిఫెన్స్ అధికారి అరెస్టయ్యారు. వ్యక్తిగత జీవితంలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆయనకు.. పాకిస్థానీ గూఢచారిగా భావిస్తున్న ఓ మహిళతో సోషల్ మీడియా ద్వారా సాన్నిహిత్యం ఉన్నట్లు విచారణలో తేలింది. అచ్చం ఇలాంటి ఘటనే ఆంధ్రప్రదేశ్‌లోనూ వెలుగు చూసింది. సోషల్ మీడియా ద్వారా పాకిస్థానీ మహిళతో స్నేహం చేస్తూ రహస్యాలు చేరవేస్తున్న ఇండియన్ నేవీ అధికారి ప్రదీప్ ముఖర్జీని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు, అంతర్జాతీయ స్థాయిలోనూ టెక్ దిగ్గజాలపై ఇలాంటి నిఘా నీడలు కమ్ముకుంటున్నాయి. ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా (చీజఱఎఱఱు) సీఈవో.. చైనా గూఢచారితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు సైతం సంచలనం సృష్టించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రక్షణ శాఖ మరింత అప్రమత్తమై కట్టుదిట్టమైన నిఘా చర్యలు చేపడుతోంది.

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు

- సుప్రీంకోర్టుకు రాహుల్!
- ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలంటూ ఆరోపణలు
- భారీగా ఓట్ల తొలగింపుపై సమాధానాలు కోరిన విపక్షాలు
- ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ప్రమాణపత్రాలకు డిమాండ్
- అధికారిక రికార్డులు బయట పెట్టాలంటూ న్యాయస్థానానికి విజ్ఞప్తి
- ఏకగ్రీవ నిర్ణయంతోనే ఉత్తర్వులు ఇచ్చామంటున్న ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ, నవంబర్ 16 (చురకలు): దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై వివాదం మరోసారి సుప్రీంకోర్టుకు చేరింది. ఈ ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని, భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు ఇతర విపక్ష నేత లు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. కేంద్ర ఎన్నికల సంఘానికి పది విభాగాల్లో మొత్తం 48 రాతపూర్వక ప్రశ్నలు సంధించేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తోపాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ప్రమేయం లేకుండానే కీలక నిర్ణయాలు తీసుకున్నారా అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం ముగ్గురు సభ్యుల ఉమ్మడి నిర్ణయంతోనే సవరణ ఉత్తర్వులు జారీ చేసిందా, లేక ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారా అన్నది తేలాల్సి ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ముగ్గురు కమిషనర్లు స్వయంగా ప్రమాణపత్రాలు సమర్పించాలని కోరారు. అయితే అక్టోబర్ 26, నవంబర్ 14 తేదీల్లో డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ ఏటూరు ద్వారా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్లలో ముగ్గురు సభ్యుల ఏకగ్రీవ నిర్ణయం మేరకే ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొందని పిటిషనర్లు వివరించారు. ఆ వాదనకు సంబంధించిన సమావేశాల వివరాలు, ఫైల్ నంబర్లు, అధికారిక రికార్డులను వెల్లడించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సమాచార వ్యవస్థలో మార్పులు చేసేందుకు ప్రైవేటు సంస్థలకు అనుమతి ఉందా, ఎన్నికల నమోదు అధికారుల ఉత్తర్వులు లేకుండానే సామూహికంగా ఓట్ల తొలగింపు జరిగిందా, సమాచార భద్రతపై తనిఖీలు నిర్వహించారా అనే అంశాలపై సమాధానాలు కోరారు. కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులో మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారు, రాష్ట్రాల వారీగా ఎంతమంది ఓటర్ల పేర్లు తొలగించారు, వాట్సాప్, వ్యక్తిగత ఈమెయిళ్ల ద్వారా అధికారిక ఆమోదాలు పొందారా అనే ప్రశ్నలనూ లేవనెత్తారు. గతంలో సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన సమాధానాలను కూడా పిటిషనర్లు ప్రస్తావించారు. వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన పుట్టస్వామి కేసు తీర్పును ఉదహరిస్తూ కీలక సమాచారం ఎన్నికల సంఘం వద్దే ఉన్నప్పుడు సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన సమాధానాలు కోరే అధికారం న్యాయస్థానానికి ఉందని పిటిషనర్లు వాదించారు. ఏదైనా అధికారిక రికార్డును గోప్యంగా ఉంచాలనుకుంటే అందుకు నిర్దిష్ట కారణాలను కోర్టుకు వివరించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తదుపరి నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రపంచానికి భారత్ సరికొత్త మార్గం చూపింది!

భారత్‌పై బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ ప్రశంసలు

స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ పురోగతి అద్భుతమని కితాబు






ముంబై, నవంబర్ 16 (చురకలు): పర్యావరణహిత ఇంధనాలను ప్రోత్సహించడంలో భారత్ సాధిస్తున్న అద్భుత పురోగతిని బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ కొనియాడారు. ప్రతిష్ఠాత్మక 'ఎర్త్‌షాట్ ప్రైజ్' ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన ఆయన, సోమవారం ముంబైలో నిర్వహించిన 'ఎర్త్‌షాట్ ప్రైజ్ ఇంపాక్ట్ అసెంబ్లీ'లో ప్రసంగిస్తూ భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 శాతం శిలాజేతర ఇంధనాల ద్వారా సమకూర్చుకోవాలన్న లక్ష్యాన్ని భారత్ నిర్దేశిత గడువుకు ఐదేళ్ల ముందే చేరుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. భారత్‌లో సౌర ఇంధన వినియోగం వేగంగా పెరుగుతోందని, దశాబ్ద కాలంలోనే సౌరవిద్యుత్ సామర్థ్యం 50 రెట్లు వృద్ధి చెందడం విశేషమని మెచ్చుకున్నారు. వాతావరణ మార్పుల సంబంధిత సమస్యలకు పరిష్కారాలు చూపడంలో అంతర్జాతీయంగా భారత్ పాత్ర నానాటికీ పెరుగుతోందని ప్రిన్స్ విలియమ్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ముందు ఆర్థికాభివృద్ధి లేదా పర్యావరణ పరిరక్షణ అనే వేర్వేరు ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉన్నాయనే తప్పుడు భావన ప్రపంచవ్యాప్తంగా ఉందని వ్యాఖ్యానించారు. అయితే, ఆ రెండింటినీ కలిపి సమస్వయంతో అభివృద్ధి పథాన నడవొచ్చని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు. "రంగులమయమైన, సంక్లిష్టమైన, పలు ప్రత్యామ్నాయాలతో కూడిన ఓ కొత్త చిత్రాన్ని భారత్ ప్రపంచానికి చూపించింది. ఇది కేవలం ఇంధనానికి సంబంధించిన మార్పు మాత్రమే కాదు, ప్రజలు మెరుగైన జీవన విధానాన్ని పొందే ప్రక్రియ" అని ప్రిన్స్ విలియమ్ అభివర్ణించారు. పర్యావరణ సమస్యలకు వినూత్న పరిష్కారాలు చూపే ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రిన్స్ విలియమ్ 2020లో 'ఎర్త్‌షాట్ ప్రైజ్'ను ఏర్పాటు చేశారు. ఆరో విడత ఎర్త్‌షాట్ ప్రైజ్ ప్రదానోత్సవ కార్యక్రమం నేడు (మంగళవారం, నవంబర్ 17) ముంబైలో అట్టహాసంగా జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 15 మంది ఫైనలిస్టులలో ఐదుగురు విజేతలను ప్రకటించి, ఒక్కొక్కరికి 1 మిలియన్ పౌండ్ల చొప్పున నగదు బహుమతి అందించనున్నారు.

కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్

ఎల్ఈటీ కమాండర్ లతీఫ్ భట్ మృతి ■ మరో ఉగ్రవాది కూడా హతం

కుల్గాం, నవంబర్ 16 (చురకలు): జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు చేపట్టిన భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్ మహ్మద్ లతీఫ్ భట్ హతమయ్యాడు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా లారూ ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో ఉగ్రవాది కూడా మరణించాడు. అతడిని ఉమర్‌గా ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న నిఘా సమాచారంతో భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. నవంబర్ 11న కుల్గాం జిల్లాలోని మీర్ బజార్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ పోస్టుపై జరిగిన దాడికి లతీఫ్ భట్ సూత్రధారిగా వ్యవహరించినట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఆ దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. దాడి అనంతరం ఉగ్రవాదులు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పారిపోవడంతో భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఐదు రోజుల పాటు అనుమానిత ప్రాంతాలను జల్లెడపట్టి చివరకు లారూ వద్ద ఉగ్రవాదుల ఆచూకీ గుర్తించాయి. లతీఫ్ భట్‌కు దక్షిణ కశ్మీర్‌లో జరిగిన పలు ఉగ్రదాడులతో సంబంధం ఉన్నట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. తాజా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ ధ్రువీకరించినట్లు వార్తలు వెల్లడించాయి. మరో ఉగ్రవాది పూర్తి వివరాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఎన్‌కౌంటర్ అనంతరం పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



ఓట్ చోర్.. గద్దీ చోడ్

భారత్ సమ్మిట్‌లో విదేశీ నేత వ్యాఖ్యలపై దుమారం!

ఇటలీ నేత వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్

జోక్యం వీసా నిబంధనల ఉల్లంఘనేనని వెల్లడి

రాహుల్ గాంధీపై బీజేపీ, బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): హైదరాబాద్ వేదికగా జరిగిన 'భారత్ సమ్మిట్' సమావేశంలో ఇటలీకి చెందిన రాజకీయ నాయకుడు జాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గతంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు ఉపయోగించిన 'ఓట్ చోర్, గద్దీ చోడ్' (ఓట్లను దొంగిలించిన వారు గద్దె దిగాలి) అనే నినాదాన్ని యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ సెక్రటరీ జనరల్ అయిన ఫిలిబెక్ ఈ సమ్మిట్‌లో ప్రస్తావించడం వివాదానికి దారితీసింది. భారత్‌లో ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఒక వ్యక్తి, ఒక ఓటు' సిద్ధాంతాన్ని కాపాడటానికి రాహుల్ గాంధీ పోరాడుతున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈ సమ్మిట్‌లో ఒక విదేశీ పౌరుడు భారత అంతర్గత రాజకీయాలపై వ్యాఖ్యానించడంపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. విదేశీయులు ఎవరైనా భారతదేశానికి కేవలం కాన్ఫరెన్స్ లేదా సెమినార్లలో పాల్గొనేందుకే 'కాన్ఫరెన్స్ వీసా'పై వస్తారని, అలా వచ్చి దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, విమర్శలు చేయడం వీసా నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ స్వయంగా పాల్గొనడమే కాకుండా, విదేశీ నేత ఆ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో ఆనందంగా నవ్వుతూ చప్పట్లు కొట్టడం పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. విదేశీ నాయకులను ఆహ్వానించి, దేశ అంతర్గత రాజకీయాలపై, ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేయించడంపై విపక్షాలు అధికార కాంగ్రెస్ పార్టీ తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

భోళా శంకరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి – ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

- శ్రీ అన్నపూర్ణ రాజరాజేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, : కార్తీక మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. సీఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధిలోని జయభేరి పార్క్‌లో కొలువుదీరిన శ్రీ అన్నపూర్ణ రాజరాజేశ్వర స్వామి దేవాలయం పంచమ వార్షికోత్సవ మహోత్సవానికి సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యంత పవిత్రమైన కార్తీక మాసంలో భక్తుల పూజలందుకుంటున్న శ్రీ అన్నపూర్ణ రాజరాజేశ్వర స్వామివారి దివ్య అనుగ్రహం భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. భోళా శంకరుడి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ప్రసరించాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, గోపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దుర్గారావు, సాయిబాబా, రాజా వెంకట్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బిరాదర్, నరేష్ కుమార్ రెడ్డి, అశోక్ రెడ్డి, సాయిబాబా రాజు, మాజీ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు పందిరి యాదగిరి, పుప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో యూజీడీ పనుల పరిశీలన

త్వరితగతిన పూర్తి చేయాలి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 16, :
శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్ డివిజన్, ప్రగతినగర్ 1లో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ యు జి డి పైప్‌లైన్ పనులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాయినేని చంద్రకాంతరావు తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల నాణ్యతను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విష్ణు, జనరల్ సెక్రటరీ శంకర్, సీనియర్ నాయకులు ఎల్లమ్మ నాయుడు, శివ, తిరుపతి, యాదగిరి, రవి, విటల్ తదితర నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్ష

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 16, :
కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ ఏడుకొండల వాడి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు, దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటపై కాంగ్రెస్ ప్రభుత్వానిది వివక్షా పూరిత వైఖరి

- ఇచ్చిన హామీలు అమలు చేయాలి.. నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..
- మాజీ మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, :
సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్ రావు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చడంపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో సమాధానం ఇచ్చామని అన్నారు. నీళ్లు లేని ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం కంటే నీళ్లు అందుబాటులో ఉన్న ప్రాంతానికి మార్చి రైతులకు మేలు చేసింది కేసీఆర్ ప్రభుత్వమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా కొత్త ప్రాజెక్టులు నిర్మించలేదని, కొత్తగా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేదని విమర్శించారు. కృష్ణా జలాల వినియోగంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ప్రజల పక్షాన బహిరంగ లేఖ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గతంలో సిద్దిపేటకు వచ్చినప్పుడు రైతులకు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేస్తామని ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరలేదని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22,819 మంది రైతులకు రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. సిద్దిపేటకు మంజూరైన పశువైద్య కళాశాలను కొడంగల్‌కు తరలించారని, ఔటర్ రింగ్ రోడ్డు, వ్యవసాయ కళాశాల, శిల్పారామం, క్రీడా మైదానం, మహిళా గురుకుల పాఠశాల తదితర అభివృద్ధి పనులను నిలిపివేశారని విమర్శించారు. సుమారు రూ.1,070 కోట్ల విలువైన పనులకు సంబంధించిన నిధులు విడుదల చేసి పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు పెండింగ్ పరిహారం చెల్లించాలని, ఇర్కోడ్ ఎత్తిపోతల పథకం, గౌరవెల్లి, తపాస్‌పల్లి, కొండపోచమ్మ సాగర్ కాలువల పనులు పూర్తి చేయాలని కోరారు. వెయ్యి పడకల ఆసుపత్రి, రింగ్ రోడ్డు, నర్సింగ్ కళాశాల, ఆయుష్ ఆసుపత్రి తదితర పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుతో పాటు రూ.4 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, వడగళ్ల వానలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. సిద్దిపేట ప్రజలపై తన వ్యక్తిగత కక్షను చూపవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక ప్రాధాన్యతలు కోరడం లేదని, ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తి చేసి, నిధులు విడుదల చేయాలని మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. సిద్దిపేట ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ముఖ్యమంత్రి హోదా గౌరవాన్ని కాపాడుకోవాలని అన్నారు.

తప్పుడు ఆరోపణలతో భూ రిజిస్ట్రేషన్‌కు అడ్డంకులు

- తాతల కాలం నుంచి సాగులో ఉన్న భూమిపై వివాదం
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి
- తహసీల్దార్ కార్యాలయంలో వీడియోలు తీస్తూ బెదిరింపులకు పాల్పడ్డారంటూ ఆరోపణలు

గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), నవంబర్ 16, :
తరతరాలుగా తమ కుటుంబం ఆధీనంలో ఉండి, సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమిని విక్రయించేందుకు సిద్ధపడితే తప్పుడు ఆరోపణలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడ్డుకుంటున్నారని మంగోల్ గ్రామానికి చెందిన జామీల్ షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధం లేని వ్యక్తులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో తమ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని వాపోయారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామానికి చెందిన జామీల్ షరీఫ్ కుటుంబానికి సర్వే నంబర్లు 312, 314లో మొత్తం మూడు ఎకరాల 26 గుంటల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. ఈ భూమి తమ తాతల కాలం నుంచి కుటుంబ ఆధీనంలోనే ఉందని, అప్పటి నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా తమ కుటుంబం పేరిట ప్రభుత్వ పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయని, రైతుబంధు నిధులు సైతం అందుతున్నాయని వివరించారు. ఇటీవల ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిని విక్రయించేందుకు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ నిమిత్తం కుకునూరుపల్లి తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం వెళ్లినట్లు తెలిపారు. అయితే అదే సమయంలో గ్రామానికి చెందిన మరో వ్యక్తి కార్యాలయానికి చేరుకుని, సదరు భూమి నిషేధిత జాబితాలో ఉందంటూ తహసీల్దార్‌ను ప్రశ్నించడమే కాకుండా, కార్యాలయంలో వీడియోలు తీస్తూ బెదిరింపులకు దిగినట్లు బాధితుడు ఆరోపించారు. తమ కుటుంబానికి చెందిన భూమిపై సంబంధం లేని వ్యక్తి అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని జామీల్ షరీఫ్ ప్రశ్నించారు. నిజంగానే ఆ భూమి నిషేధిత జాబితాలో ఉంటే అందుకు సంబంధించిన అధికారిక ఆధారాలను చూపించాలని డిమాండ్ చేశారు. గతంలోనూ ఇదే వ్యక్తి ఇలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, ఆ కేసులో కోర్టు జరిమానా విధించిందని ఆయన పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలు, నిరాధార అభ్యంతరాల కారణంగా అసలైన భూ యజమానులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి



రావద్దని ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని అధికారులను కోరారు.

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌కు పరిష్కారం చూపాలి

సంబంధిత రెవెన్యూ అధికారులు భూమికి సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జామీల్ షరీఫ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తప్పుడు అభ్యంతరాలతో తమ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేయకుండా, న్యాయపరమైన విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగింది
- పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, :
అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం సిద్దిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కుటుంబం ఆస్తులను కూడబెట్టు కోవడం, దోచుకోవడం, దాచుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చిందని తీవ్రంగా విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయని పరిస్థితిని మనంకళ్లారా చూశామన్నారు. దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, దళిత బంధు పథకం విషయంలోనూ అర్హులకు అన్యాయం చేశారని విమర్శించారు.



అంతేకాకుండా పేద దళితుల భూములను స్వాధీనం చేసుకుని ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్న చరిత్ర గత పాలకులదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేద ప్రజలకు కొత్త రేషన్ కార్డులు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీపై వంటగ్యాస్, రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రైతు భరోసా, వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

19న ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

ఈ నెల 19వ తేదీన సిద్దిపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మైనంపల్లి హనుమంతరావు కోరారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సభ వేదికగా ఇంటింటికీ ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. కుటుంబానికి ఆధారమైన ఇంటి పెద్దకు అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా బీమా ద్వారా అండగా నిలవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా సాకి ఆనంద్ వ్యవహరించగా, చేనేత కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యులు సూర్యవర్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాడూరి శ్రీనివాస్ గౌడ్, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నంగునూరు, చిన్నకోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు దేవులపల్లి యాదగిరి, మీసం మహేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు సాకి బాల్ లక్ష్మి ఆనంద్, ఆలకుంట మహేందర్, రియాజ్, ఎల్లం యాదవ్, బుచ్చిరెడ్డి, సిద్దిపేట జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ తప్పెట శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేణుక, మాజీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి , సిద్దిపేట పట్టణంతో పాటు చిన్నకోడూరు, నంగునూరు, నారాయణరావుపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 16, :
జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో సోమవారం గ్రామానికి చెందిన తురక సుజాత, తురక రాణి మోహన్ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు చీరలను కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్, మాజీ సర్పంచ్ గంగారాం, నాయకులు సదానందం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



యువత దిశ మారితే.. దేశ దశ మారుతుంది..

- దేశ భవిష్యత్తుకు యువతే వెన్నుముక.. యువశక్తితోనే నవభారత నిర్మాణం..
- యువతలోని ప్రతిభను వెలికితీసి సమాజాభివృద్ధికి వినియోగించాలి
- ఈ నెల 22న హైదరాబాద్‌లో భారీ యువజన సమ్మేళనం
- సిద్దిపేటలో సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించిన ఆదర్శ యువజన ఉద్యమ సభ్యులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, : దేశ ప్రగతికి యువతే చోదకశక్తి, దేశ భవిష్యత్తుకు యువతే వెన్నుముక, యువత సరైన మార్గంలో పయనిస్తేనే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని ఆదర్శ యువజన ఉద్యమం (ఐవైఎం) తెలంగాణ సభ్యులు వహీద్, అబ్దుల్ ఖుద్దుస్ అన్నారు. యువతలో అపారమైన ప్రతిభ, అద్భుతమైన ఆలోచనా శక్తి, సాధించాలనే పట్టుదల ఉన్నాయని, వాటికి సరైన దిశానిర్దేశం కల్పిస్తే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తిగా యువత ఎదుగుతుందని పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి యువతే రేపటి దేశ నిర్మాతలని, యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. అయితే నేటి పోటీ ప్రపంచంలో కొందరు యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాల వినియోగానికి, జూదానికి, అంతర్జాల మోసాలకు ఆకర్షితులవుతూ తమ అమూల్యమైన జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతను అటువంటి అనర్థాల నుంచి దూరం చేసి, మంచి ఆలోచనలు, ఉన్నతమైన ఆశయాలు, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన జీవితాన్ని గడిపేలా చైతన్యపరచడమే తమ ఉద్యమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారి నైపుణ్యాలను సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దేందుకు ఆదర్శ యువజన ఉద్యమం



కృషి చేస్తోందన్నారు. లక్ష్యం లేని జీవితం దిక్కుతోచని ప్రయాణంతో సమానమని, లక్ష్యంతో కూడిన జీవితం విజయానికి బాటలు వేస్తుందని వారు పేర్కొన్నారు. యువత తమ శక్తి సామర్థ్యాలను గుర్తించి, చెడు మార్గాలకు దూరంగా ఉంటూ విద్య, విజ్ఞానం, సేవాభావం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నేరాలు లేని సమాజం, బాధ్యతాయుతమైన యువత, శాంతియుతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఈ నెల 22న హైదరాబాద్‌లో ఆదర్శ యువజన ఉద్యమం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మేళనం ద్వారా యువతకు సమాజం పట్ల బాధ్యత, జీవిత లక్ష్యాల పట్ల స్పష్టత, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ నలుమూలల నుంచి యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం యువజన సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖుద్దుస్, వహీద్, హాజీ సిద్దిక్, అతిఫుద్దీన్, హబీబుద్దీన్, అమీర్, మిస్కిన్, మొహమ్మద్ కరీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభకు సర్వం సిద్ధం

- 16 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కట్టా హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, :
ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నాగదేవత ఆలయం ముందు భాగంలోని నందాల వెంకటలక్ష్మి గార్డెన్ వెనుక, బైపాస్ రహదారి–చిన్నగుండవెల్లి రహదారికి ఆనుకొని సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. సోమవారం సభా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు



చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాక్టర్లు, డోజర్ల సహాయంతో సభా ప్రాంగణాన్ని చదును చేసే పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. మైదానం అంతటా పలుమార్లు నీటిని చల్లి దుమ్ము లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం చుట్టూ బారికేడ్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని, నీటిని చల్లే పనులు పూర్తయిన వెంటనే వేదిక నిర్మాణ పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైదానం చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలను ట్రాక్టర్లు, డోజర్లతో చదును చేసి వాహనాల పార్కింగ్‌కు అనువుగా తీర్చిదిద్దాలని, వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ హరికిరణ్, రహదారులు భవనాల శాఖ, మున్సిపల్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

17వ వార్షిక సదర్ సమ్మేళనానికి విశేష స్పందన

- హాజరైన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, యాదవ సంఘాల నాయకులకు సదర్ కమిటీ కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, : జగద్గిరిగుట్టలో ఆదివారం ఘనంగా నిర్వహించిన 17వ వార్షిక సదర్ సమ్మేళన మహోత్సవానికి విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, యాదవ సంఘాల నాయకులు, బీజేపీ నేతలు, బీజేవైఎం నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు సదర్ కమిటీ చైర్మన్ జేకే శేఖర్ యాదవ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, అరవింద్ యాదవ్ (టిల్లు), మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, శేరిలింగంపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, సికింద్రాబాద్ ఇంచార్జ్ నందనం దివాకర్, బీజేపీ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్ రావుల శేషగిరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంఎస్ వాసు, మాజీ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి, మేడ్చల్ జిల్లా కౌన్సిల్ నెంబర్ పరుష వేణు, పద్మా నగర్ డివిజన్ అధ్యక్షులు కట్ట కుమార్, తదితరులు హాజరయ్యారు. అదేవిధంగా యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీను యాదవ్, గోట్ అండ్ షీప్ మాజీ ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, మాజీ కార్పొరేటర్ బట్ట బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు భూమయ్య యాదవ్, ప్రముఖ విద్యాసంస్థల అధినేతలు శాంతి కుమార్ యాదవ్, మానస్ యాదవ్ తదితర యాదవ సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శరత్ చంద్ర, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ నాగదీప్ గౌడ్, సాయి కృష్ణ రెడ్డి, బీజేవైఎం నాయకులు పృథ్వీ, శ్రీనాథ్, శ్యామ్ తదితరులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేకే శేఖర్ యాదవ్ మాట్లాడుతూ యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళన మహోత్సవానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నాయకులు, యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ అమూల్యమైన సమయాన్ని కేటాయించి కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ సదర్ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



మహోత్సవం విజయవంతం కావడానికి సహకరించిన యాదవ సంఘాల ప్రతినిధులు, బీజేపీ, ఓబీసీ నాయకులు, బీజేవైఎం నేతలు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మిత్రులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు, యాదవ సోదరులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ అందరి సహకారం, ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ముందడుగు

- ప్రజావాణిలో వినతిపై స్పందించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్..
- రెండు రోజుల్లో ఎస్టిమేట్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, :
ప్రజల ఆరోగ్య పరిరక్షణ, యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడం, వృద్ధుల శారీరక దృఢత్వానికి ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా సుచిత్ర సమీపంలోని వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ గన్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు ముందడుగు పడింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కుత్బుల్లాపూర్



జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ కాలనీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లోగా ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సంబంధించిన అంచనాలు (ఎస్టిమేట్) సిద్ధం చేసి, సంబంధిత ఫైల్‌ను సమర్పించాలని సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు సూచించారు. కాలనీవాసుల ఆరోగ్య అవసరాలను గుర్తించి, వినతిపై తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు కాలనీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర ఎన్‌క్లేవ్ కాలనీ ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రమణరావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజా అవసరాలే ప్రాధాన్యం.. కాలనీ అభివృద్ధే లక్ష్యం!

ఆధ్యాత్మిక చింతనతో ప్రజలందరూ ప్రశాంత జీవనం గడపాలి

ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, : ప్రజలందరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకొని, భక్తి మార్గంలో పయనిస్తూ ప్రశాంతమైన, సుఖసంతోషాలతో కూడిన జీవనం గడపాలని బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆకాంక్షించారు. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్గూంనగర్‌లో గల శ్రీ శివ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, అయ్యప్ప స్వాములు, శివస్వాములతో కలిసి పరమశివునికి అభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రజలందరికీ ఆ పరమశివుని ఆశీస్సులు లభించి, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కొలుకుల జైహింద్, సాయి నరసింహతో పాటు పెద్ద సంఖ్యలో శివస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఘనంగా బీసు వెంకటేశం గౌడ్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, : జై గౌడ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి, భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బీసు వెంకటేశం గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు పశ్చిమట్ట నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రతాపరెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల్ అశోక్‌తో పాటు పలువురు కాలనీ వాసులు పాల్గొని బీసు వెంకటేశం గౌడ్‌తో కేక్ కట్ చేయించి, పూలమాలలు, శుభాకాంక్షలతో జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ. వెంకట్ రెడ్డి, మల్లేష్ నరసింహ, పుండరీకం, సాయిబాబా, ఈశ్వర్, కిషన్ గౌడ్, అశోక్ గౌడ్, మధు గౌడ్, గడ్డం రాము, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, శివ పటేల్, రాజు గౌడ్, ఇస్మాయిల్ తదితరులతో పాటు స్థానిక మహిళలు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసు వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ.. తన జన్మదిన వేడుకలను ఇంతటి ఆత్మీయతతో, పండుగ వాతావరణంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తనపై ప్రేమాభిమానాలు చూపించి, వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

షాపూర్ నగర్ మార్కెట్ పార్కులో అపరిశుభ్రత..

- టాయిలెట్స్ మరమ్మతులకు వినతి
- మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కూన రాఘవేందర్ గౌడ్ కు మార్కెట్ కమిటీ సభ్యుల వినతి



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్ నగర్ డివిజన్ పరిధిలోని షాపూర్ నగర్ మార్కెట్ పార్కులో టాయిలెట్స్, వాష్‌రూమ్స్ నిర్వహణ అధ్వానంగా మారడంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కులోని మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి, వాటిని పరిశుభ్రంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మార్కెట్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు 291వ డివిజన్ షాపూర్ నగర్‌కు చెందిన కూన రాఘవేందర్ గౌడ్‌కు మార్కెట్ కమిటీ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. సమస్య తీవ్రతను వివరించి, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కూన రాఘవేందర్ గౌడ్ స్పందిస్తూ, సమస్యను పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మార్కెట్ కమిటీ సభ్యులు కోరారు.

జగద్గిరిగుట్టలో ఘనంగా 17వ సదర్ సమ్మేళనం..

- సదర్ సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్
- యాదవ సోదరులకు అభినందనలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, : జగద్గిరిగుట్టలో ఆదివారం నిర్వహించిన 17వ సదర్ సమ్మేళన మహోత్సవం అంగరంగ వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై సదర్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదర్ సంబరాలను తిలకించిన ఆయన మాట్లాడుతూ.. యాదవ సోదరుల ఐక్యతకు, వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి సమ్మేళనాలు చక్కని వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో సదర్ ఉత్సవాల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. అనంతరం 17వ సదర్ సమ్మేళనాన్ని క్రమబద్ధంగా, ఘనంగా నిర్వహించిన సదర్ ఉత్సవ సమితి సభ్యులను కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సదర్ ఉత్సవాల నిర్వాహకులు శేఖర్ యాదవ్, నాయకులు బుచ్చిరెడ్డి, మోతె శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికీ చేయూత పింఛన్లు అందిస్తాం





- గజ్వేల్ నియోజకవర్గంలో 3,266 మందికి కొత్త పింఛన్ల మంజూరు, 390 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ
- ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 16, : సంవత్సరాల తరబడి కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా చేయూత పింఛన్లు అందిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతితో కలిసి సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన 3,266 మంది లబ్ధిదారులకు కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను, రెండో విడతలో 390 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హత కలిగిన వారెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గజ్వేల్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మరో 2,000 ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో ఇళ్లు పొందిన లబ్ధిదారులు సొంతింటిలో సంతోషంగా జీవిస్తున్నారని చెప్పారు. దీపావళి సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపామని, కొత్త ఇంటిలో దీపాలు వెలిగించుకుంటున్న వారి ఆనందం చూస్తుంటే సొంతింటి కల నెరవేరిన సంతృప్తి కలిగిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందించామని వెల్లడించారు.

ప్రజలకు అండగా సంక్షేమ పథకాలు

200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి నెలకు సుమారు రూ.1,200 వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతోందని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు మూడేళ్లలో ప్రభుత్వం రూ.12 వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందిస్తున్నామని, అదనపు వైద్య ఖర్చుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,500 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని, పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాల పాలనలో పేరుకుపోయిన అప్పుల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఉందని, సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పులకు నెలనెలా భారీగా వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని మంత్రి పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు.. యువతకు ఉపాధి..

జిల్లాలో మహిళా సంఘాలకు రూ.330 కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేశామని, వచ్చే ఏడాది నాటికి భవన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసి వివిధ విభాగాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, టామ్‌కామ్ ద్వారా విదేశాల్లోనూ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ నెల 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఐదు లక్షల ఇందిరమ్మ కుటుంబాల బీమా పథకాన్ని ప్రారంభించనున్నారని మంత్రి వెల్లడించారు.

అభివృద్ధికి సహకరించాలి.. ఎమ్మెల్సీ యాదవరెడ్డి..

ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ గతంలో వితంతువులు, దివ్యాంగులకు మాత్రమే పింఛన్లు అందేవని, ప్రస్తుతం ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు కూడా పింఛన్లు అందించడం శుభపరిణామమని అన్నారు. అర్హులైన వారికి పింఛన్లు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరం: కలెక్టర్ హైమావతి

జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు తగ్గుతున్నందున వరి సాగుకు దూరంగా ఉండాలని, ఒక ఎకరా వరి పంటకు అవసరమయ్యే నీటితో పది ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చని వివరించారు. రైతు వేదికల వారీగా వ్యవసాయ అధికారులు అనుకూలమైన పంటల సాగుపై రైతులకు సూచనలు, సలహాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లోకకల్యాణం కోసం 11 ఏళ్లుగా ఆధ్యాత్మిక కార్యక్రమం

- 108 కిలోల ఆవు నెయ్యి.. కోట్లాది వత్తులతో మహాదీప ప్రజ్వలన..

దమ్మపేట, నవంబర్ 16, : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలోని శ్రీ గాయత్రి తపోభూమి (శ్రీ గాయత్రి ఆశ్రమం)లో నవంబర్ 24వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు మహాదీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా 108 కిలోల ఆవు నెయ్యి, కోట్లాది వత్తులతో మహాదీపాన్ని వెలిగించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు ప్రేమ్ సుస్థిర గురూజీ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గత 11 సంవత్సరాలుగా నిరంతరాయంగా నిర్వహిస్తున్న ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని లోకకల్యాణం, ప్రపంచ శాంతి, సకల జనుల శ్రేయస్సును ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజున మహాదీప దర్శనం విశేష పుణ్యప్రదమని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ అరుణాచలేశ్వర స్వామివారి దివ్య తేజస్సును దర్శించుకోవాలని కోరారు. కార్తీక మాసంలో శివారాధన, అభిషేకం, అర్చన, ఉపవాసం, దానధర్మాలకు విశేష ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ మహా దీపోత్సవంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి దైవానుగ్రహం పొందాలని ప్రేమ్ సుస్థిర గురూజీ విజ్ఞప్తి చేశారు.



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- ప్రతి అర్జీపై తీసుకున్న చర్యల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, : ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసి భద్రపరచాలని జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ అధికారులను ఆదేశించారు.సోమవారం సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించి మొత్తం 165 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తారని, వారి అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల స్వీకరణతోనే బాధ్యత ముగియదని, వాటిపై ఏయే చర్యలు తీసుకున్నారు, సమస్య ఏ దశలో ఉంది, పరిష్కారం కోసం చేసిన ప్రయత్నాలు ఏమిటి, అనే వివరాలను స్పష్టంగా నమోదు చేసి భద్రపరచాలని సూచించారు. అదేవిధంగా మండల, డివిజన్ స్థాయిల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాల్లో స్వీకరించిన దరఖాస్తులను కూడా పెండింగ్‌లో ఉంచకుండా



త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ ఆదేశించారు.

ప్రజావాణి ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 16, : ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిఆర్ఓ కె. వై ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై ప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి!

- అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్మికులకు న్యాయం చేయాలి: ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి, వారి సొంతింటి కలను సాకారం చేయాలని ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం రోడ్డామేస్త్రి నగర్ డివిజన్‌లోని మద్దూమ్ నగర్ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరారు. వివిధ జిల్లాల నుంచి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చిన పేద కార్మికులకు ఉపాధితో పాటు నివాస స్థలాలు కల్పించిన ఘనత మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి, మాజీ ముఖ్యమంత్రి టి. అంజయ్య, మాజీ కార్మిక మంత్రి పి. జనార్దన్ రెడ్డిలకు దక్కుతుందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారిశుధ్య కార్మికులకు వివిధ కార్పొరేషన్ల పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఇళ్లు కేటాయించాలని కోరారు. హైదరాబాద్‌కు వలస వచ్చిన కార్మికులకు అండగా నిలిచిన మహానాయకులు గడ్డం వెంకటస్వామి, పి. జనార్దన్ రెడ్డి, టి. అంజయ్య పేర్లతో ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి కార్మికుల సేవలను గౌరవించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, రాష్ట్ర అధ్యక్షులు గుంజా శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి డాక్టర్ అమర్ బాబు, దళిత సంక్షేమ సంఘం రాష్ట్రీయ చైర్మన్ జేబీ రాజు, ప్రధాన కార్యదర్శి వై. బాలరాజు, అధ్యక్షులు అవిజ జేమ్స్‌లతో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కనీస వేతనాల అమలులో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించిన ఆయన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాపాలనలో రాష్ట్రంలోని ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాదయాత్ర సందర్భంగా అసంఘటిత రంగ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు గిగ్ కార్మికుల కోసం చట్టం తీసుకురావడం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం వంటి చర్యలు అభినందనీయమన్నారు. గతంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసిన ఘనత యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణ గౌడ్, ఐఎన్‌టీయూసీ మీ సేవ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు.

గాజులరామారంలో బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి విస్తృత పర్యటన

- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తాం – గిరివర్ధన్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 16, : కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం డివిజన్‌లో బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలను సందర్శిస్తూ స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ప్రజా సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. మొదట చంద్రగిరి నగర్‌లోని శ్రీ హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, నిర్వహణకు సంబంధించిన సమస్యలపై ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డివిజన్ నాయకులతో కలిసి భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించారు. తదుపరి స్థానిక కమ్యూనిటీ హాల్‌లో డివిజన్‌కు చెందిన వివిధ వర్గాల ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. పర్యటనలో భాగంగా పార్టీ కార్యకర్త ఇంట్లో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా గిరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. గాజులరామారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం డివిజన్‌లోని పలువురు సీనియర్ నాయకుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావడం, పార్టీ కార్యక్రమాలను ప్రతి బూత్‌కు చేరవేయడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం సాగించాలని, గాజులరామారం డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో–కన్వీనర్ రావుల శేషగిరి రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనాథ్, జిల్లా నాయకులు రచ్చ చక్రధర్, కంది శ్రీరాములు, భీమ్ రావు, డివిజన్ అధ్యక్షులు సాయి ప్రతాప్, శారద, ముఖ్య నాయకులు సాయినేత, ఇతర నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే ఇందిరమ్మ జీవిత బీమా లక్ష్యం

జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, :



రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 19 నాడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబంలోని సంపాదించే సభ్యునికి జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ పథకంలో అర్హులైన ప్రతి కుటుంబాన్ని నమోదు చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పథకం ఉద్దేశం, అర్హతలు, నమోదు విధానం, అవసరమైన పత్రాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పథకం కింద ఒక్కో అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కుటుంబంలో సంపాదించే సభ్యుని వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని, వివరించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారని తెలిపారు. ఆధార్ కార్డులో కేవలం పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదై ఉన్న సందర్భంలో జూలై 1వ తేదీని పుట్టిన తేదీగా పరిగణిస్తారని పేర్కొన్నారు. నమోదు ప్రక్రియ సులభంగా, ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లావ్యాప్తంగా మొత్తం 481 శిబిర కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున 385 శిబిర కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో 96 శిబిర కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సమీపంలోనే నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని, శిబిరాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, డేటా అందుబాటులో లేదనే కారణంతో ఏ ఒక్క అర్హుడిని కూడా శిబిరం నుంచి వెనక్కి పంపించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆహార భద్రత కార్డు లేని కుటుంబాలకు కూడా కొత్తగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని, ప్రతి దరఖాస్తుదారునికి అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. జిల్లాలో నిర్దేశించిన 2,83,458 కుటుంబాల నమోదు లక్ష్యాన్ని సాధించడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రజావాణిపై ప్రజల్లో సన్నగిల్లుతున్న నమ్మకం!

- ఫిర్యాదులు చేస్తున్నా పరిష్కారం శూన్యం.. అధికారుల తీరుపై ప్రజల అసహనం

దమ్మపేట, నవంబర్ 16, :



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజావాణికి ఆశించిన స్పందన లభించడం లేదు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించినప్పటికీ పరిష్కారాలు లభించకపోవడంతో కార్యక్రమంపై క్రమంగా నమ్మకం కోల్పోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజావాణికి వచ్చే అరకొర ఫిర్యాదులపైనా అధికారులు కేవలం అర్జీలు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించడం, సాంకేతిక కారణాలు చూపిస్తూ కాలయాపన చేయడం తప్ప సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో తమ సమస్యలు చెప్పుకున్నా ప్రయోజనం లేదనే భావన ప్రజల్లో నెలకొంటోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పంచాయతీ ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితులతో పాటు అత్యవసర సమయాల్లో ఫైర్ ఇంజన్లు సైతం వెళ్లేందుకు వీలులేని విధంగా రహదారులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన ప్రజలను ఎక్సైజ్ శాఖ అధికారులు సమస్య పరిష్కార దిశగా ప్రోత్సహించాల్సింది పోయి, బెల్ట్ షాపులు ఎక్కడ ఉన్నాయంటూ ప్రశ్నించడం, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ఫిర్యాదులను తేలికగా తీసుకుంటున్నారనే భావన బలపడుతోంది. ఫలితంగా ప్రజావాణికి వెళ్లి సమయం వృథా చేసుకోవడం ఎందుకనే నిరాశతో ప్రజలు కార్యక్రమానికి దూరంగా ఉంటున్నారని తెలుస్తోంది. ప్రజావాణి అంటే కేవలం అర్జీలు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించే కార్యక్రమం మాత్రమే కాదు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించే వేదికగా మారాలి. ఫిర్యాదులపై కాలపరిమితితో కూడిన చర్యలు తీసుకొని, పరిష్కార స్థితిని ఫిర్యాదుదారులకు తెలియజేయాలి. అప్పుడే ప్రజావాణి లక్ష్యం నెరవేరి అని, ప్రజలకు నమ్మకం పెరుగుతుంది పిర్యాదుదారులు వాపోతున్నారు.

పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- పాఠశాల నిర్మాణానికి 2.39 ఎకరాల స్థలం కేటాయింపు
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 16, :

రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు.కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలోని 2.39 ఎకరాల స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం విద్యాశాఖకు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ మను చౌదరి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సోమవారం కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్య గ్రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, కేటాయించిన స్థలంలో వీలైనంత త్వరగా పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, గృహ నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తూ పాఠశాల నిర్మాణానికి కేటాయించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని బండి రమేష్ గారు అన్నారు.ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, రాజేష్, శంకర్ గౌడ్, కొప్పిశెట్టి దినేష్ కుమార్, రంగమోహన్, బాబ్జి కుమార్, నితీష్, సంధ్య వాణి, సుజాత, సరోజ, అపర్ణ, జయలక్ష్మి , రాజేశ్వరి, బచ్చుమల్లి, రజిత, గోపాల్ చౌదరి, కల్పన, రజిని తదితరులు పాల్గొన్నారు.



పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజలకు సత్వర న్యాయం, విజిబుల్

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- వార్షిక తనిఖీల్లో భాగంగా మెట్ పల్లి పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ



జగిత్యాల/మెట్ పల్లి, నవంబర్ 16, :

పోలీస్ శాఖలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించడం, నేరాల నియంత్రణ, నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు నాణ్యత, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించేందుకు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సోమవారం మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు విధానం, నేరాల నియంత్రణ చర్యలు, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి, నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులు, సిబ్బంది విధుల కేటాయింపు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 5ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ సిబ్బంది యూనిఫాం నీట్ టర్న్‌అవుట్‌తో ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు.నూతన సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. డయల్–112 కు వచ్చే ప్రతి కాల్‌పై వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి అత్యంత వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, వారిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణలో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై ప్రజలను చైతన్యపరిచి, అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, ఇన్స్పెక్టర్లు సురేష్ బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు కిరణ్ కుమార్, అనిల్, రాజు నాయక్, శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ ఉద్యోగులకు అండగా నిలుస్తాం

- ఉద్యోగులకు అన్యాయం జరిగితే పోరాటం తప్పదు
- టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి
- మాతా శిశు ఆసుపత్రిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం

కరీంనగర్, నవంబర్ 16, : ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే టీఎన్జీవోల సంఘం ప్రధాన లక్ష్యమని సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో భోజన విరామ సమయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నర్సింగ్ అధికారులు, నర్సింగ్ సూపరింటెండెంట్లకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎన్జీవోల సంఘంలో సభ్యత్వం అంటే కేవలం సభ్యత్వ రుసుము వసూలు చేయడం కాదని, నిబద్ధత కలిగిన ఉద్యోగులను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల కోసం పోరాడటమని పేర్కొన్నారు. ఎనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన సంఘం ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. నర్సింగ్ ఉద్యోగులు ప్రజల ప్రాణాలను కాపాడే సేవా సైనికులని కొనియాడారు. కరోనా, విషజ్వరాల వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఎదురైనా సంఘం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ఆటంకాలు ఎదురైనా, ప్రభుత్వపరంగా రావాల్సిన హక్కులకు భంగం కలిగినా న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. సంఘం క్రమశిక్షణ, ఐక్యతకు మారుపేరని, ప్రతి ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సంఘం గౌరవాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాయకులు కమలాకర్, లవకుమార్, కరుణాకర్, నారాయణ, గుండ రాజేష్, బండ అన్వేష్, ప్రకాశం, రాహేల్, రాజేష్, దిలీప్, ఉదయ్, సరోజ, రాధిక, షెర్లీ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



బియ్యం దుకాణాలపై రెవెన్యూ అధికారుల ప్రత్యేక తనిఖీలు

- ప్రభుత్వ నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలి
- అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు : వ్యాపారులకు రెవెన్యూ అధికారుల హెచ్చరిక



దమ్మపేట, నవంబర్ 16, :
మండల కేంద్రంలో బియ్యం దుకాణాలపై రెవెన్యూ అధికారులు సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం వ్యాపారులకు పలు సూచనలు చేస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే వినియోగదారులకు బియ్యం విక్రయించాలని ఆదేశించారు. ప్రతి టిక్కీ 26 కిలోల బియ్యం తగ్గకుండా ఉండేలా చూడాలని, బియ్యం రకాలు, వాటి ధరలను స్పష్టంగా తెలియజేసే విధంగా దుకాణాల ముందు ఫ్లెక్సీ ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించారు.
వినియోగదారులకు ధరల విషయంలో ఎలాంటి అయోమయం కలగకుండా పారదర్శకంగా వ్యాపారం నిర్వహించాలని వ్యాపారులకు దిశానిర్దేశం చేశారు. బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి ఫిర్యాదులు వస్తే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం నిర్ణీత ధరలకు అందించడమే లక్ష్యంగా తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బద్రు నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు బిక్షమయ్య, వీరస్వామి, జీపీఓ కుంజా పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చొప్పదండి/కొడిమ్యాల, నవంబర్ 16, :
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని గంగారాంతండా, సూరంపేట, కోనాపూర్ గ్రామాల గ్రామ సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన సెర్ప్(ఐకెపి) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం గ్రామ సర్పంచులు వినోద్, గంగవ్వ, ఎంపిడిఓ స్వరూప, డిప్యూటీ తహసీల్దార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోగురి నాగ భూషన్ రెడ్డి, వివిధ గ్రామాల ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులు, ఎపియం మల్లేశం సీసీలు విరాకుమార్, కమల, మంగ, పంచాయతీ సెక్రెటరీలు, విఓఏలు రాజేశ్వరి, రాజమణి, స్వప్న, గ్రామ సంఘాల అధ్యక్షులు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్లతో నిరుపేదలకు కొండంత ఆసరా

- గన్నేరువరంలో పెన్షన్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



మానకొండూర్/గన్నేరువరం, నవంబర్ 16, :
ఎలాంటి ఆసరా లేని నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపి, వారికి ఆర్థిక భరోసా కల్పించడమే చేయూత పెన్షన్ల ప్రధాన ఉద్దేశమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం గన్నేరువరం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో చేయూత పథకం కింద నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెన్షన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రాష్ట్రాన్ని గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదేళ్ల పాలనలో నిరుపేదలకు ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా అందించలేకపోయారని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గతంలో వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు పెన్షన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, అధికారులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో దుబ్బాక విద్యార్థుల చారిత్రాత్మక విజయం

- బరిలో దిగిన తొమ్మిది మంది.. తొమ్మిది బంగారు పతకాలతో శతశాతం ఫలితం..
- రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన గ్రామీణ విద్యార్థులు.. దుబ్బాక మండలానికి గర్వకారణం..



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 16, :
రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో దుబ్బాక మండల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి విజయదుందుభి మోగించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ బంగారు పతకాన్ని సాధించి శతశాతం విజయాన్ని నమోదు చేయడం విశేషం. మొత్తం తొమ్మిది మంది విద్యార్థులు బరిలోకి దిగి తొమ్మిది బంగారు పతకాలు కైవసం చేసుకోవడంతో దుబ్బాక మండలానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. సంగారెడ్డి జిల్లా భానూర్లో నవంబర్ 15న నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే పోటీలు-2026లో దుబ్బాక మండలానికి చెందిన విద్యార్థులు ఈ ఘనత సాధించారు. యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న నాలుగు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రత్యర్థులను అధిగమించి బంగారు పతకాలను అందుకున్నారు.

పాఠశాలల వారీగా పతకాల వివరాలు

మాస్టర్ మైండ్ పాఠశాల, దుబ్బాక-5 బంగారు పతకాలు. సరస్వతి గ్లోబల్ పాఠశాల-2 బంగారు పతకాలు. గాయత్రి వివేకానంద విద్యాలయం-1 బంగారు పతకం. రజనీకాంత్ రెడ్డి పాఠశాల-1 బంగారు పతకం.

బంగారు పతక విజేతలు

మాస్టర్ మైండ్ పాఠశాల.. హన్విక ప్రియా, వివాన్, నక్షని హానిష్, సాత్విక్, క్రిష్. సరస్వతి గ్లోబల్ పాఠశాల.. రిశ్విత, శిల్పిత. గాయత్రి వివేకానంద విద్యాలయం.. వర్ష. రజనీకాంత్ రెడ్డి పాఠశాల.. గగన్.

అకాడమీ వ్యవస్థాపకులకు ఘన సత్కారం

విద్యార్థులు సాధించిన ఈ అపూర్వ విజయాన్ని పురస్కరించుకుని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, సుశాంక్ వర్ధన్లను పవర్ డ్రాగన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేక జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. డ్రాగన్ ప్రదర్శనతో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో పాటు నిరంతర సాధన ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఈ విజయం నిరూపించిందన్నారు. తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని తొమ్మిది బంగారు పతకాలు సాధించడం ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, సరైన శిక్షణ అందిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదగగలరని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి పోటీల్లో పాల్గొనేలా సహకరించిన నాలుగు పాఠశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు ప్రముఖుల అభినందనలు

ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్కేఏఐ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ నగేష్, ఆర్ఎస్ఎస్కేఏఐ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, సుబ్బు షోటోకాన్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు సురేందర్ సుబ్బు, సుశాంక్ వర్ధన్, పీటీ శ్రీనివాస్ గౌడ్ తదితరులు బంగారు పతక విజేతలను, అకాడమీ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ను ప్రత్యేకంగా అభినందించారు.


గ్రామీణ ప్రతిభకు రాష్ట్రస్థాయి గుర్తింపు

దుబ్బాక విద్యార్థులు సాధించిన ఈ విజయం కేవలం పతకాలకే పరిమితం కాలేదు. పట్టుదల, క్రమశిక్షణ, సరైన శిక్షణ తోడైతే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం రాష్ట్రస్థాయి వేదికలపై విజయకేతనం ఎగుర వేయగలరని చాటిచెప్పింది. తొమ్మిది మందికి తొమ్మిది బంగారు పతకాలు రావడం దుబ్బాక మండల క్రీడా ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.

అయ్యప్ప మాలధారణతో వస్తే పాఠశాలలోకి అనుమతి లేదా?

- సెయింట్ మార్టిన్ స్కూల్ యాజమాన్యంపై ఏబీవీపీ ఆగ్రహం.. పాఠశాల ఎదుట భారీ ధర్నా!


కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 16, : అయ్యప్ప మాలధారణ చేసుకున్న విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలతో బాలానగర్ పరిధిలోని సెయింట్ మార్టిన్ హైస్కూల్ యాజమాన్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు సైతం పాల్గొని యాజమాన్య వైఖరిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి విద్యాసంస్థపై ఉందని పేర్కొన్నారు. అయ్యప్ప మాలధారణ చేసుకుని పాఠశాలకు వచ్చిన విద్యార్థులను లోపలికి అనుమతించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, సమానత్వం, సోదరభావం నేర్పించాల్సిన విద్యాసంస్థల్లోనే ఇలాంటి వివక్షాపూరిత ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల మధ్య కులమత భేదాలకు తావులేకుండా అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా మాలధారణ చేసుకుంటే, దానిని కారణంగా చూపి విద్యకు దూరం చేయడం తగదని హితవు పలికారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థలే వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం తక్షణమే స్పందించి, విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించకపోవడానికి గల కారణాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని నిరసనకారులు కోరారు.





సీతారామ భూ నిర్వాసితులకు పరిహారం అందించేందుకు చర్యలు

- రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు
- కుటుంబ వివాదాలతో రూ.6 కోట్ల పరిహారం పెండింగ్.. పరిష్కారానికి అధికారుల కసరత్తు



దమ్మపేట, నవంబర్ 16, :
సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించడంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సోమవారం దమ్మపేట మండల రెవెన్యూ కార్యాలయంలో భూములు కోల్పోతున్న రైతులను పిలిపించి వారి సమస్యలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే. వెంకట్రావు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, సాగులో ఉన్న భూములను కోల్పోతున్న రైతులను గుర్తించాలని అధికారులకు సూచించారు. పరిహారం పొందేందుకు అవసరమైన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు తదితర ధ్రువపత్రాలను తహసీల్దార్ కార్యాలయం ద్వారా మాన్యువల్గా జారీ చేసి, అర్హులైన ప్రతి రైతుకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దమ్మపేట మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాలు అయిన పాత్వరిగూడెం, నాగుపల్లి, జగ్గారం, దమ్మపేట లకు చెందిన భూ నిర్వాసితులకు సుమారు రూ.6 కోట్ల పరిహారం కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా పెండింగ్లో ఉన్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే. వెంకట్రావు వెల్లడించారు. పట్టాదారులు, అనుభవదారుల మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించిన అనంతరమే సంబంధిత రైతులకు పరిహారం చెక్కులు అందజేస్తున్నట్లు వివరించారు. 2021 నాటి ధరల ప్రకారం ఎకరాకు రూ.8 లక్షల చొప్పున నష్టపరిహారం నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందేలా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బద్రు నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బిక్షమయ్య, వీరస్వామి, దమ్మపేట జీ.పి.ఓ కుంజా పాపయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ ప్రసన్న కుమార్ జన్మదిన వేడుకలు

- శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ ఇన్-చార్జ్ బండి రమేష్

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 16, :
కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గ భవన్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నియోజకవర్గ చైర్మన్ మట్టే ప్రసన్న కుమార్, ఎం డీ అనిఫ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బండి రమేష్ ప్రసన్న కుమార్కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ప్రసన్న కుమార్ కాంగ్రెస్ పార్టీలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ఎస్సీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ఏ ఎం సీ డైరెక్టర్ అస్లం సోఫీ, ఎస్సీ విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ యాదగిరి, రాజు, మహిళా అధ్యక్షురాలు సంధ్య, రజిని, నవాజ్, వాసు, నజీర్, జమీర్, సల్మాన్, పాషా, రియాన్, డివిజన్ మహిళా నాయకురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





సమాజ సేవలో తరించిన పద్మజా నాయుడు

నేడు పద్మజా నాయుడు జయంతి

పద్మజా నాయుడు (నవంబర్ 17, 1900 – మే 2, 1975) స్వాతంత్ర్య సమర యోధురాలు, కవయిత్రి, సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ గా పని చేసిన మహిళ. ఆమె హైదరా బాద్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సంయుక్త వ్యవ స్థాపకురాలు. పురుషుల ఆధిపత్య ప్రజా రంగంలో, సామాజిక సేవ కురాలిగా, రాజకీయ నాయకు రాలిగా, పాలకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. పద్మజా నాయుడు 1900 నవంబర్ 17న హైదరాబాద్‌లో జన్మించారు. ఆమె (బెంగాలీ) తల్లి ప్రఖ్యాత కవి, భారత స్వాతంత్ర్య సమర యోధుడు సరోజిని నాయుడు. ఆమె (తెలుగు) తండ్రి ముత్యల గోవింద్రజులు నాయుడు వైద్యుడు. ఆమెకు జైసూర్య, లీలమణి, ఆదిత్య, రణధీర అనే నలుగురు తోబుట్టువులు. పద్మజా నాయుడు పెద్దగా చదువు కోలేదు. చిన్ననాడు చేరిన మహ బూబియా బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగేళ్ళు మాత్రమే చదివారు. బాల్యంలో తరుచుగా అనారోగ్యానికి గురికావడంతో ఆమె చదువు సరిగా సాగలేక పోయింది. ఆమె నేర్చుకున్న విద్య, సంస్కారం అంతా తన తల్లి వివాస మైన గోల్డెన్ థ్రెషోల్డ్‌కు వచ్చి పోయే వారి మధ్యే సాగి పోయింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వర్క్ శాఖను ఏర్పాటు చేసి ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమా లను చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణకై ఆమె ఎంతో మంది ముస్లిం స్త్రీలను సభ్యులుగా చేర్చుకొని ప్లేగు రిలీఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. పౌరుల స్వేచ్ఛ కొరకు, జాగిర్దారీ వ్యవస్థకు వ్యతి రేకంగా స్థాపించ బడిన స్వదేశీ లీగ్ అనే సంస్థకు అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆ సంస్థ ఆధ్వర్యం లోనే, ఆమె తన సంపాదకత్వంలో వన్ వరల్డ్ అనే పత్రికను నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సామ్యవాద సిద్ధాంతానికి ప్రభావి తులైన కొందరు ఉస్మానియా విద్యార్థులు కామ్రేడ్స్ అసోసి యేషన్ స్థాపించగా, సంస్థకు పద్మజా నాయుడు సహకారాన్ని అందించారు. 1935లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడి నప్పుడు, రైతుల దుర్భర పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి ఏర్పడిన హైదరాబాద్ సహాయక సంఘానికి ఆమె అధ్యక్షురాలుగా వ్యవహ రించారు. అనేక ప్రాంతాలు పర్యటించి, భాధితులకు తక్షణ సహాయం అందేలా ఏర్పాట్లు చేశారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. అప్పటికి మహిళలకు ప్రత్యేకమైన జైళు ళ లేకపోవడం, పలుకుబడి కలిగిన కుటుంబానికి చెందిన వారు కావడం మూలాన ఆమెను హయత్ నగర్ లోని బేగం గారి దేవిడిలో సకల సౌకర్యాలు కలిగిన రాజభవనంలో నిర్బంధించారు. దానికి ఆమె సంతోషించక తనతో పాటు అరెస్ట్ అయిన తక్కిన మహిళలకు ఎందుకు ఆ వసతులు కల్పించలేదని ప్రశ్నించారు. చైనా యుద్ధ సమయంలో ఆమె తనకున్న విలువైన బంగారు ఆభరణాలను నేషనల్ డిఫెన్స్ ఫౌండేషన్ కు సమర్పించారు. భారతదేశం నుండి " క్రమబద్ధమైన బ్రిటీష్ ఉప సంహరణ" కోరుతూ మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నం దుకు ఆమె 1942 లో జైలు పాలైనారు. ఖాదీ గురించి గాంధీ సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసేందుకు, విదేశీ వస్తువులను బహిష్కరించడానికి కృషి సల్పారు. 1950 లో పద్మజా నాయుడు భారత రాజ్యంగ సభకు ఎన్నికై రెండేళ్ళు ఆ పదవిలో కొనసాగారు. ఆ తరువాత ఆమె 1956 నుండి 1967 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పని చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా తల్లితో పాటు పనిచేసిన పద్మజ, 21 యేళ్ల వయసులోనే హైదరా బాదులో భారత జాతీయ కాంగ్రెస్ సహ వ్యవస్థాపకురాలు అయ్యారు. స్వాతంత్ర్యానంతరం పద్మజా నాయుడు పార్లమెంటుకు ఎన్నికైనారు. కానీ అనారోగ్యం వల్ల రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తరువాత పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పని చేశారు. అర్ధ శతాబ్దానికి పైగా ఉన్న ఆమె ప్రజా జీవితంలో, స్వచ్ఛంద సేవలో ఔట్సాహికురాలై, ఆమె మానవ సంక్షేమ నిర్దేశిత, అంతర్జాతీయ మానవతా సంస్థ రెడ్‌క్రాస్ సొసైటీ తో సంబంధం కలిగి ఉండేది. బంగ్లాదేశ్ శరణార్థుల సహాయచర్య లప్పుడు భారత రెడ్ క్రాస్ సంస్థ ఛైర్ పర్సన్ గాను పని చేసి, ప్రముఖ పాత్ర పోషించారు. పద్మజా నాయుడుకు భారత్ సేవక్ సమాజ్, అఖిల భారత హస్తకళల బోర్డు, నెహ్రూ స్మారక నిధి వంటి సంస్థలతో అనుబంధం ఉండేది. 1961లో పద్మజ తన కవితా సంకలనం "ది ఫెదర్ ఆఫ్ డాన్" పేరుతో ప్రచురించారు. 1975లో పద్మజా నాయుడు స్మృత్యర్థం డార్జిలింగులోని జంతు ప్రదర్శన శాలను పద్మజా నాయుడు హిమాలయ జంతు ప్రదర్శన శాలగా మార్చగా, నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రారంభో త్సవం చేశారు. పద్మజా నాయుడు తన తల్లి (సరోజిని నాయుడు) నివాసం ది గోల్డెన్ థ్రెషోల్డ్‌ను 1970 లలో హైదరాబాద్ విశ్వవిద్యా లయానికి (యుఒహెచ్) అప్పగించారు. భారతజాతికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారం లభించింది. పద్మజా నాయుడు 1975 మే 2 న పరమపదించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494




చిన్నారుల భవిష్యత్తు అంధకారమేనా!

నేడు జాతీయ బాలల దినోత్సవం

విద్యార్థి దశలోనే బంగారు భవితకు పునాది

నేడు అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం

విద్యార్థుల పోరాటానికి , వారి బలిదానానికి గుర్తుగా నవంబర్ 17వ తేదీని అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంగా జరుపు కుంటారు. 1939 లో సామ్రాజ్య విస్తరణ కాంక్షతో నాజీలను పొరుగు దేశాలతో యుద్ధానికి తరలించాడు ... హిట్లర్. ఈ క్రమంలో జకోస్లోవేకియా దేశంలో ప్రాగ్ నగరములోని విశ్వవిద్యాలం లోనికి నాజీ సేనల ప్రవేశాన్ని విద్యార్థులు అడ్డుకున్నారు. తమ ప్రవేశాన్ని నిలవరించిన విశ్వ విద్యాలయ విద్యార్థులపై పాశవికంగా కాల్పులు జరిపి పదిమంది విద్యార్థి నాయకులను సంహరించి మరో 1200 మందిని నాజీలు సృష్టించిన కాంసంట్రేషన్ క్యాంప్ అనే నరకం లోనికి తరలించారు. ఆ సంఘటన జరిగింది 1939 నవంబర్ 17 న. ఆ తర్వాత రెండేళ్ళకు లండన్ లో సమావేశమైన అంతర్జాతీయ విద్యార్థుల సమైక్య మండలి నాటి వీరోచిత విద్యార్థి పోరాటానికి, వారి బలిదానానికి గుర్తుగా నవంబర్ 17 ను " అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవం" గా ప్రకటించింది. అయితే పోరాటాలు మాత్రమే విద్యార్థి జీవితంలో ముఖ్యమైనవి కావు. ప్రతి విద్యార్థికి లక్ష్య నిర్దేశం అత్యవసరం, అనివార్యం. భారత దేశంలో 2004లో ముంబైలో ప్రపంచ సామాజిక సదస్సు నవంబర్ 17న జరిగింది. అంతర్జాతీయ విద్యార్థి సంఘాలు, జాతీయ సంఘాలు, ఇటాలియన్ సంఘాలు హాజరయ్యాయి.విద్యార్థుల అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన అంశాలపై చర్చించాయి. విద్య "కొరకై" అర్థించువాడు 'విద్యార్థి. కాని నేడు విద్యార్థి అనే పదానికి పరిమితి కుదించి స్కూలు, కాలేజీ , విశ్వ విద్యాలయములలో చదివే వారినే విద్యార్థులుగా భావిస్తున్నారు . కాలంతో పాటే అన్నీ మారాయి... అంతే వేగంగా చదువుకునే విద్యార్థుల్లో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి... ఒకప్పుడు ఐదేళ్ల నిండితే కాని అక్షరాభ్యాసం చేసి పాఠశాలల్లో చేర్చే వారు కాదు... అది మారి రెండేళ్ల ప్రాయానికే పూర్వ ప్రాథమిక పాఠశాలలు... నర్సరీ విద్యలు, కాన్సెప్ట్ పాఠశాలలు అంటూ ఏమీ తెలియని, అడుగులు సరిగా వేయలేని వయస్సులో బడిబాట పట్టి పసి వయసులోనే విద్యార్థిగా మారుతున్నాడు. పలక బలపం పట్టి అఆఇఈలు దిద్దే చేతులు పెన్ను పేపరు పట్టి ఎబిసిడిలు రాస్తున్నాయి. ఒకప్పుడు ఐదవ తరగతి దాటితే ఆరులో ఇంగ్లీష్ విద్య అందుబాటు లోకి వచ్చేది. అమ్మా... ఆవు అంటూ పలికే నాలుకలు ఎ ఫర్ ఆపిల్.. బి ఫర్ బాల్ అనే శబ్దాలను ఉచ్చరిస్తున్నాయి... పలకా బలపం మాయమై పెన్ను పేపరుతోనే చదువులు మొదలవుతున్నాయి. పరిసరాల విజ్ఞానం అంటూ అంతో ఇంతో చదివే వయసులోనే కంప్యూటర్ ముందు కూర్చొని చేతిలో మౌస్ తీసుకొని ప్రపంచ పరిజ్ఞానాన్ని, అంతరిక్ష రహస్యాలు తెలుసుకునే స్థాయికి ఎదిగ చూస్తున్నారు విద్యార్థులు... ఐదేళ్ల నిండిన తర్వాత బడి దుమ్ములు కొట్టే దశ నుండి ఎప్పుడు బడివేళ అవుతుందా అని ఎదురు చూసే విధంగా తయారయ్యారు నేటి విద్యార్థులు. పాఠశాల సమయంలోనే ఆటలకు ప్రాధాన్యం ఇచ్చే రోజులు పోయి పుస్తకాల్లో మునిగే స్థితికి మారాయి. బాల భానుని లేలేత కిరణాలు పడీ పడడంతో కాలంతో పరుగులు తీస్తూ చకచకా తయరై డ్రెస్సులు, మోయలేనంత బరువున్న పుస్తకాల బ్యాగులతో స్కూలు బస్సుల్లో కాన్వెంట్ చదువులంటూ పరుగులు. వచ్చి రాగానే ట్యూషన్‌లు, ఆలోపు స్పెషల్ క్లాసులు ఇలా నిద్రించే సమయం తప్ప ఆడిపాడే వయస్సంతా అక్షరాలతో కుస్తీ పడుతూనే కాలం వెళ్లదీస్తున్నారు విద్యార్థులు. ఒకప్పుడు ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యలు చదవాలంటే మహా నగరాలకు వెళ్లాల్సి వచ్చేది... మారిన కాలానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రొఫెషనల్ విద్యలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు సదరు విద్యాభ్యాసంపై ఆసక్తి కనబరుస్తున్నారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనది, మరువలేనిది. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు విద్యతోపాటు సాంస్కృతిక రంగాలలో కూడా రాణించాలి . ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించు కోవడం ద్వారానే



ఉపాధి అవకాశాలు పొందేందుకు వీలుంటుంది. విద్యార్థులు విద్యార్థి దశను వృధా చేయకుండా జీవితానికి పూలబాట వేసుకునేందుకు వినియోగించు కోవాలి. అదేవిధంగా ఉ పాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేయాలి. డిగ్రీ కోసం కాక విజ్ఞానము కోసం తపించే వారంతా నిజమైన విద్యార్థులని ప్రపంచము నేడు అంగీకరింస్తుంది. మన దేశములో పురాతన శాసనాల గురించి, ప్రాచీన గ్రంధాల గురించి , చరిత్ర , ఆర్కియాలజీ, వివిధ శాస్త్రాలలో, అంశాలలో కృషి చేసి పేరెన్నికగన్న చాలా మందికి డిగ్రీలు లేవు. అయినప్పటికీ ఆయా అంశాలలో నిష్ణాతులు వారు. నిత్య విద్యార్థులుగా శ్రమిస్తారు.విద్యను ఆర్జించడానికి వయసుతో సంబంధం లేదు. ప్రతిఒక్కరూ జీవించి ఉన్నంత కాలము ఏదో ఒక కొత్త విద్యను నేర్చుకుంటూనే ఉంటారు. కనుక ప్రతి ఒక్కరిని విద్యార్థిగానే భావించాల్సి వుంటుంది. వయసుతో సంబంధం లేనిది విద్య అని అర్థము చేసుకున్నందునే వయోజన విద్య పధకము మొదలైనవి అమలు చేశారు. గృహిణి , ఉద్యోగి , ఏస్థాయిలో, ఏ వయసులో ఉ న్నవారైనా విద్యార్థిగా ఆలోచించ వచ్చన్నది నేటి భావన. విజ్ఞానము సంపాదించడం , అదికూడా సక్రమ మార్గంలో ఉండడం , కృషి , పట్టుదల , క్రమశిక్షణ మున్నగునవి విద్యార్థికి ఉండాల్సిన లక్షణాలు. పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల అవగాహన విద్యార్థికి అదనపు లక్షణాలు. తాను ఆర్జించిన విద్యను సక్రమ మార్గములో వినియోగిస్తూ విద్యార్జనకు అంతం లేనన్నది గ్రహించిన వాడే నిజమైన విద్యార్థి. వారే సమాజానికి ఉపయోగ పడతారు. అలాగే విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి. సామాజిక బాధ్యతతో కూడిన నైతిక విలువలను పెంపొందించు కోవాలి. నవసమాజ నిర్మాణ స్థాపకులుగా ఎదగాలి. అదే అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవ సందేశము.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

సచిన్‌తో గల్లీ క్రికెట్ ఆడిన బ్రిటన్ రాజదంపతులు!

- ముంబైలో చిన్నారులతో కలిసి సందడి చేసిన విలియం, కేట్
- బౌలింగ్ చేసిన యువరాజు.. బ్యాట్ పట్టిన కేట్
- పదేళ్ల తర్వాత మరోసారి సచిన్‌తో క్రికెట్
- ఆట అనంతరం సంప్రదాయ కుల్హడ్ చాయ్ ఆస్వాదన



ముంబై, నవంబర్ 16 (చురకలు): బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, ఆయన భార్య కేట్ మిడిల్టన్ భారత్ పర్యటనకు వచ్చారు. 3 రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ముంబైకి చేరుకున్న ఈ రాజదంపతులు.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో కలిసి గల్లీ క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా స్థానిక చిన్నారులతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముంబైలోని బల్లార్డ్ ఎస్టేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్స్ విలియం, కేట్‌తో పాటు సచిన్ టెండూల్కర్, భారత మాజీ మహిళా క్రికెటర్ పూనమ్ రౌత్ పాల్గొన్నారు. 'ది రైట్ పిచ్' అనే సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రికెట్ ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెంచడం, వారికి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా ప్రిన్స్ విలియం బౌలింగ్ చేయగా.. కేట్ బ్యాటింగ్ చేశారు. స్థానిక పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కొందరు రాజదంపతులతో కలిసి క్రికెట్ ఆడగా.. మరికొందరు పక్కన ఉండి ఆటను ఆస్వాదించారు. ప్రిన్స్ విలియం, కేట్ 2016లో భారత్‌లో పర్యటించినప్పుడు కూడా ముంబైలోని ఓవల్ మైదానంలో స్థానిక చిన్నారులతో క్రికెట్ ఆడారు. అప్పట్లోనూ సచిన్ టెండూల్కర్ వారితో కలిసి పాల్గొన్నారు. ఇప్పుడు పదేళ్ల తర్వాత మరోసారి సచిన్‌తో కలిసి క్రికెట్ ఆడటంతో ఈ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. క్రికెట్ ఆడిన తర్వాత రాజదంపతులు సచిన్‌తో కలిసి సంప్రదాయ మట్టి కప్పుల్లో అందించే కుల్హడ్ చాయ్‌ను ఆస్వాదించారు. ప్రిన్స్ విలియం స్థాపించిన 'ఎర్త్‌షాట్ ప్రైజ్' వార్షిక అవార్డుల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ జంట భారత్‌కు వచ్చింది. నవంబర్ 17న జరగనున్న ఈ వేడుకలో పర్యావరణ పరిరక్షణకు వినూత్న పరిష్కారాలు చూపిన ఐదు ప్రాజెక్టులకు ఒక్కొక్కటి మిలియన్ పౌండ్ల చొప్పున బహుమతి అందించనున్నారు. బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహార్ ఈ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. అలియా భట్, సోనమ్ కపూర్, రామీ మాలెక్ వంటి ప్రముఖులు హాజరుకానున్నారు. గాయని శ్రేయా ఘోషల్, బ్రిటిష్ పాప్ బ్యాండ్ టేక్ దట్ సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్నారు. రాజదంపతులు ఈ పర్యటనలో భాగంగా ముంబై మెట్రో ప్రయాణం, భారతీయ సినిమా, ఫ్యాషన్, పర్యావరణ ఆవిష్కరణలకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ రాజదంపతులు పాల్గొంటారు. నవంబర్ 18న న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన తదుపరి వారి పర్యటన ముగియనుంది.



ఐసీసీ చైర్మన్‌గా మరోసారి జై షా!

రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన భారత క్రికెట్ నిర్వాహకుడు

బాలి (ఇండోనేషియా), నవంబర్ 16 (చురకలు): అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా జై షా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వార్తలు వెలువడ్డాయి. ఇండోనేషియాలోని బాలిలో నిర్వహించిన ఐసీసీ బోర్డు సమావేశాల అనంతరం ఆయనను మరోసారి చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. ఇంగ్లండ్, జింబాబ్వే, న్యూజిలాండ్‌తోపాటు అసోసియేట్ సభ్య దేశాల ప్రతినిధులు ఆయన నాయకత్వానికి మద్దతు తెలిపినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ప్రపంచ క్రికెట్ కీలక మార్పుల దశలో ఉన్న సమయంలో జై షాకు మరోసారి బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 ఆగస్టు 27న తొలిసారి ఐసీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా అదే ఏడాది డిసెంబర్ 1న బాధ్యతలు స్వీకరించారు. అప్పటి చైర్మన్ గ్రెగ్ బార్క్లే స్థానంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. కేవలం 36 ఏళ్ల వయసులో ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఆ పదవిని అధిష్ఠించిన అత్యంత పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందారు. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలెస్ వేదికగా జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి ప్రవేశించనుండటం జై షా నాయకత్వానికి కీలక అంశంగా మారనుంది. శతాబ్దానికి పైగా విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కనుంది. మహిళా క్రికెట్ అభివృద్ధి, అసోసియేట్ సభ్య దేశాలకు మరిన్ని అవకాశాలు, అంతర్జాతీయ పోటీల నిర్వహణ, ద్వైపాక్షిక సిరీస్‌ల బలోపేతం వంటి అంశాలపై ఐసీసీ దృష్టి సారించనుంది. జై షా మరోసారి ఎన్నిక కావడంపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు చైర్మన్ రిచర్డ్ థాంప్సన్ హర్షం వ్యక్తం చేసినట్లు సమాచారం. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌ను సమర్థంగా రూపొందించడంతోపాటు సంప్రదాయ క్రికెట్ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మరోవైపు తనపై విశ్వాసం ఉంచిన ఐసీసీ బోర్డు సభ్యులకు జై షా కృతజ్ఞతలు తెలిపినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. క్రికెట్‌ను కొత్త దేశాలకు, కొత్త తరాలకు చేరువ చేయడంతోపాటు ఆటగాళ్లు, అభిమానులు, వాణిజ్య భాగస్వాముల ప్రయోజనాలను పరిరక్షించడమే తన లక్ష్యమని వెల్లడించినట్లు సమాచారం.

48 బంతుల్లో 135 పరుగులు

ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ వీరవిహారం!



న్యూ చండీగఢ్, నవంబర్ 16 (చురకలు): రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుతమైన ఇన్నింగ్స్‌తో చరిత్ర సృష్టించాడు. మధ్యప్రదేశ్ జట్టుకు సారథ్యం వహిస్తున్న రజత్ పాటిదార్, అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 48 బంతుల్లోనే 8 ఫోర్లు, 13 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 281.25 విధ్వంసకర స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన పాటిదార్, కేవలం 41 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు 57 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ క్లిష్ట సమయంలో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రజత్ పాటిదార్, అస్సాం బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మైదానం నలుమూలలా బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పాటిదార్ మెరుపు బ్యాటింగ్ కారణంగా మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ సెంచరీతో రజత్ పాటిదార్ తన పాత రికార్డును తానే బద్దలు కొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున సెంచరీ సాధించిన తొలి బ్యాటర్‌గా రజత్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. గతంలో 2021లో గోవాపై 96 పరుగులు, 2022లో రైల్వేస్‌పై 92 పరుగులు చేసి త్రుటిలో సెంచరీలను చేజార్చుకున్న పాటిదార్, ఇప్పుడు మూడంకెల స్కోరును దాటి ఆ లోటును భర్తీ చేసుకున్నాడు. కాగా, ఇటీవల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ వన్డే టోర్నమెంట్‌కు ఎంపికైనప్పటికీ, 50 ఓవర్ల క్రికెట్ ఆడేందుకు తన శరీరం పూర్తిగా సహకరించడం లేదని, అందుకే కేవలం టీ20 క్రికెట్‌పైనే దృష్టి పెడుతున్నానని స్పష్టం చేస్తూ పాటిదార్ ఆ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. తాజా తుఫాన్ ఇన్నింగ్స్‌తో టీ20 ఫార్మాట్‌లో తాను ఎంత ప్రమాదకరమైన ఆటగాడో పాటిదార్ మరోసారి నిరూపించుకున్నాడు.

విరాట్ కోహ్లీకి ఏమైంది?

- 11 ఏళ్లలో తొలిసారి వరుసగా మూడు సింగిల్ డిజిట్ స్కోర్లు!



న్యూఢిల్లీ/ఆక్లాండ్, నవంబర్ 16 (చురకలు): న్యూజిలాండ్‌తో ముగిసిన ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేలవ ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈ పర్యటనలో కోహ్లీ మొత్తం నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి 21.50 సగటుతో కేవలం 86 పరుగులు మాత్రమే సాధించాడు. అయినప్పటికీ, భారత జట్టు తరఫున ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా (టాప్ స్కోరర్) కోహ్లీనే నిలవడం గమనార్హం. సిరీస్ మొత్తంలో ఏ ఒక్క భారత బ్యాటర్ కూడా కనీసం 100 పరుగుల మార్కును చేరుకోలేకపోవడం టీమిండియా సమష్టి బ్యాటింగ్ వైఫల్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో కోహ్లీ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 51 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 74 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. అయితే ఆ తర్వాత జరిగిన మ్యాచ్‌లలో కోహ్లీ తన జోరును కొనసాగించలేకపోయాడు. వెల్లింగ్టన్‌లో జరిగిన రెండో వన్డేలో 7 పరుగులకే వెనుదిరిగాడు. మూడో వన్డే వర్షం కారణంగా రద్దు కాగా, మౌంట్ మౌంగనుయ్‌లో జరిగిన నాలుగో వన్డేలో మాట్ హెన్రీ బౌలింగ్‌లో నాలుగు బంతులు ఆడి డకౌట్ (0) అయ్యాడు. ఇక ఆదివారం జరిగిన చివరిదైన ఐదో వన్డేలోనూ మాథ్యూ ఫిషర్ బౌలింగ్‌లో కేవలం 5 పరుగులకే కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. తొలి మ్యాచ్‌లో చేసిన 74 పరుగులు మినహాయిస్తే, ఆ తర్వాతి మూడు ఇన్నింగ్స్‌లలో కోహ్లీ కేవలం 12 పరుగులు మాత్రమే సాధించాడు. ఒకే వన్డే సిరీస్‌లో వరుసగా మూడుసార్లు సింగిల్ డిజిట్ (7, 0, 5) స్కోర్లకు పరిమితం కావడం గత 11 ఏళ్లలో కోహ్లీకి ఇదే తొలిసారి. చివరిసారిగా 2014-15లో ఆస్ట్రేలియాలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో అతను ఇలా వరుసగా మూడుసార్లు సింగిల్ డిజిట్‌కు ఔటయ్యాడు. న్యూజిలాండ్‌పై వన్డేల్లో 2,000 పరుగుల మైలురాయికి 103 పరుగుల దూరంలో బరిలోకి దిగిన కోహ్లీ, ఆ రికార్డుకు 17 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా అత్యంత కీలకమైన ఈ దశలో సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేస్, బౌన్స్ పిచ్‌లపై తడబడటం టీమిండియా మేనేజ్‌మెంట్‌ను తీవ్రంగా కలవరపెడుతోంది.



ఫైనల్స్‌కు ఆండ్రీవా

యూఎస్ఓ: టెన్నిస్‌లో సీజన్ ఎండింగ్ టోర్నీ అయిన డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో రష్యా యువ సంచలనం మిరా ఆండ్రీవా జోరు కొనసాగుతోంది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో 19 ఏండ్ల ఆండ్రీవా.. 6-3, 6-4తో జెస్సికా పెగులా (అమెరికా)ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి డబ్ల్యూటీఏ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో ఆమె స్వితోలిన (ఉక్రెయిన్)తో తలపడనుంది. 2004లో రష్యాకే చెందిన మారియా షరపోవా (17 ఏండ్లకు) తర్వాత ఈ టోర్నీ ఫైనల్స్ చేరిన తొలి టీనేజర్‌గా ఆండ్రీవా రికార్డులకెక్కింది.



భయంతో నిద్రలేని రాత్రులు గడిపా

ఇంట్లో దెయ్యం ఉందేమోనని వణికిపోయా!

ఆసక్తి రేపుతున్న శ్రుతిహాసన్ వ్యాఖ్యలు


చెన్నై, నవంబర్ 16 (చురకలు): తన ఇంట్లో దెయ్యం ఉందేమోనని భయపడిన సందర్భాలు ఉన్నాయని ప్రముఖ సినీనటి శ్రుతిహాసన్ వెల్లడించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. చెన్నైలోని తన ఇంట్లో ఓ బొమ్మ కారణంగా ఎదురైన వింత అనుభవాలు తనను తీవ్ర భయాందోళనలకు గురిచేశాయని ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు సమాచారం. ఎవరూ ముట్టుకోకుండానే బొమ్మ ఒకచోటు నుంచి మరోచోటుకు మారిపోతుండటంతో ఏం జరుగుతోందో అర్థంకాక వణికిపోయానని ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తన ఇంట్లో మనిషి పరిమాణంలో ఉండే ఓ బొమ్మ ఉండేదని, దానికి 'ఫియోనా' అని పేరు పెట్టుకున్నానని శ్రుతిహాసన్ తెలిపినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇంటికి వచ్చిన స్నేహితులు కూడా ఆ బొమ్మను సరదాగా పలకరించేవారని, మొదట్లో దానిని సాధారణ బొమ్మగానే భావించానని చెప్పారట. అయితే కొంతకాలానికి ఆ బొమ్మను ఒకచోట ఉంచితే మరోచోట కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యానని వెల్లడించినట్లు సమాచారం. ముఖ్యంగా ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఇలాంటి అనుభవాలు ఎదురవడంతో భయం మరింత పెరిగిందని చెప్పారట. ఇంట్లో ఏదో అదృశ్య శక్తి ఉన్నట్లు అనిపించేదని, ఆ భయాన్ని అధిగమించేందుకు హనుమాన్ చాలీసా వినడంతోపాటు చేతిలో ఉప్పు పట్టుకుని ప్రార్థనలు చేసేదాన్నని శ్రుతిహాసన్ వివరించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ బొమ్మ విషయంలో భయం తగ్గకపోవడంతో చివరకు దానిని ఇంటి నుంచి తొలగించాలని నిర్ణయించుకున్నారట. బొమ్మను పూర్తిగా విడదీసి, భాగాలను బయటకు పంపించేసినట్లు తెలిపారట. అనంతరం మనశ్శాంతి కోసం ఇంట్లో పూజలు నిర్వహించుకున్నానని, ఆ తర్వాత ప్రశాంతంగా అనిపించిందని చెప్పినట్లు సమాచారం. తనకు ఎదురైన అనుభవం ఓ భయానక చిత్రంలోని సన్నివేశాన్ని తలపించిందని శ్రుతిహాసన్ వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బొమ్మ నిజంగానే దానంతట అదే కదిలిందనడానికి స్వతంత్ర ఆధారాలు లేవు. ఆమె వ్యక్తిగత అనుభవంగా ప్రచారంలో ఉన్న ఈ కథనం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

పెళ్లి తర్వాతా తగ్గేదేలే..

వివాహం తర్వాత కూడా వైవిధ్యమైన పాత్రలపై దృష్టి

కెరీర్‌కు పెళ్లి అడ్డుకాదని చాటుతున్న 'మహానటి'

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): సినీ పరిశ్రమలో పెళ్లి తర్వాత కథానాయికలకు అవకాశాలు తగ్గుతాయనే పాత అభిప్రాయానికి భిన్నంగా కీర్తి సురేష్ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. 2024 డిసెంబర్ 12న తన చిరకాల మిత్రుడు ఆంటోనీ తట్టిల్‌ను వివాహం చేసుకున్న ఈ 'మహానటి' సినిమాలకు విరామం ఇవ్వకుండా వరుస ప్రాజెక్టులతో బిజీగా మారింది. వివాహమైన కొద్దిరోజులకే వరుణ్ ధావన్ సరసన నటించిన 'బేబీ జాన్' చిత్రం విడుదల కావడం విశేషం. ఆ తర్వాత 'ఉప్పు కప్పురంబు', 'రివాల్వర్ రీటా' వంటి చిత్రాలతో ప్రేక్షకులను పలకరించింది. కేవలం సంప్రదాయ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్న కథాంశాలు, పాత్రలను ఎంచుకుంటూ తన నటనలో కొత్త కోణాలను ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తోంది. కథానాయికగా నటించడంతోపాటు ప్రత్యేక గీతాల్లో కనిపించేందుకూ ఆసక్తి చూపుతోందన్న ప్రచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు అగ్ర కథానాయకుల చిత్రాల్లోనూ ఆమె పేరు వినిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న కొన్ని కొత్త చిత్రాలు, ప్రత్యేక గీతాలు, విడుదల తేదీలపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. 'మహానటి'తో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కీర్తి సురేష్ తన కెరీర్‌లో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇస్తోంది. పెళ్లి తర్వాత కూడా కథానాయికగా అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. మొత్తానికి వ్యక్తిగత జీవితాన్ని, సినీ ప్రయాణాన్ని సమన్వయం చేసుకుంటూ కీర్తి సురేష్ తనదైన శైలిలో దూసుకుపోతోంది.







జుట్టు కత్తిరించుకున్నానని చెప్పగానే అమ్మ ఫోన్ పెట్టేసింది!

ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన సాయిపల్లవి

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): సహజమైన అందం, అద్భుతమైన నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న కథానాయిక సాయిపల్లవి తాజాగా తన జుట్టు గురించి వెల్లడించిన ఆసక్తికర విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పాత్ర కోసం తన పొడవాటి ఉంగరాల జుట్టును కత్తిరించుకోవడంతో తల్లి తీవ్రంగా బాధపడ్డారని, ఆ విషయం చెప్పగానే ఫోన్ పెట్టేశారని సాయిపల్లవి వెల్లడించినట్లు ప్రచారం జరుగుతోంది. మేకప్‌కు దూరంగా ఉంటూ సహజమైన అందంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయిపల్లవి తన జుట్టు విషయంలో తీసుకున్న నిర్ణయం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'అమరన్' చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న 'ఓఎం' చిత్రంలో సాయిపల్లవి ఐపీఎస్ అధికారిణిగా కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమె పాత్ర పేరు నిత్యారెడ్డి అని ప్రచారం జరుగుతోంది. నిజజీవిత ఐపీఎస్ అధికారిణి మెరిన్ జోసెఫ్ రూపాన్ని స్ఫూర్తిగా తీసుకుని దర్శకుడు ఈ పాత్రను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. పాత్రకు సహజత్వం తీసుకురావాలనే ఉద్దేశంతో సాయిపల్లవి పొడవాటి జుట్టును కత్తిరించుకునేందుకు సిద్ధమైనట్లు సినీ వర్గాల సమాచారం. అయితే ఈ నిర్ణయం ఆమె తల్లికి ఏమాత్రం నచ్చలేదట. చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టంగా పెంచుకున్న జుట్టును సినిమా కోసం కత్తిరించుకున్నట్లు సాయిపల్లవి ఫోన్‌లో చెప్పగానే తల్లి ఆశ్చర్యానికి గురై మాట్లాడకుండా ఫోన్ పెట్టేశారట. కొంతకాలం ఆ విషయాన్ని జీర్ణించుకోలేకపోయారని సాయిపల్లవి చెప్పినట్లు కథనాలు వెలువడుతున్నాయి. సాధారణంగా సినీ తారలు పాత్రలకు అనుగుణంగా విగ్గులు, ఇతర సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తుంటారు. కానీ పాత్రలో పూర్తిగా ఒదిగిపోయేందుకు సాయిపల్లవి తన రూపాన్ని మార్చుకోవడం విశేషంగా మారింది. కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇచ్చే నటిగా ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఆమె తాజా నిర్ణయం మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే చిత్రం, పాత్ర వివరాలతోపాటు జుట్టు కత్తిరించుకోవడంపై ఆమె చేసిన వ్యాఖ్యలకు అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.





హీరో తేజ సజ్జా నిశ్చితార్థం!

కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వేడుక

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): యువ కథానాయకుడు తేజ సజ్జా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. సోమవారం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఆయన నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు ప్రముఖ నటుడు చిరంజీవి, రవితేజ, రానా, శివాజీ, వరలక్ష్మి శరత్‌కుమార్ దంపతులు వేడుకలో పాల్గొన్నారు. దర్శకులు కె.రాఘవేంద్రరావు, ప్రశాంత్ వర్మ, కార్తీక్ ఘట్టమనేని, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, సాహూ గారపాటి తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ వేదికగా తేజ సజ్జా వివాహం జరగనున్నట్లు సమాచారం. అనంతరం హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం వివాహ విందు ఏర్పాటు చేయనున్నారు. కాగా, తమది పెద్దలు కుదిర్చిన వివాహమని తేజ సజ్జా ఇటీవల వెల్లడించారు. వధువు కుటుంబానికి సినీ పరిశ్రమతో సంబంధం లేదని, వారు సాంకేతిక రంగానికి సంబంధించిన వ్యాపారంలో ఉన్నారని తెలిపారు. బాలనటుడిగా సినీ రంగంలోకి ప్రవేశించి, 'హనుమాన్', 'మిరాయ్' వంటి చిత్రాలతో కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్'

ఆకట్టుకుంటున్న చిత్ర ట్రైలర్!

హైదరాబాద్, నవంబర్ 16 (చురకలు): యువ కథానాయకుడు సుగి విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్'. పరమేష్ రేణుకుంట్ల దర్శకత్వంలో మాదం దయానంద్, కార్తీక్ వెంపటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో జుప్సీ భద్ర కథానాయికగా పరిచయం కానున్నారు. నవంబర్ 27న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం సోమవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రేమ, పెళ్లి, కెరీర్‌తోపాటు స్వేచ్ఛగా జీవించాలనుకునే నేటితరం యువత ఆలోచనలను వినోదాత్మకంగా ఆవిష్కరించినట్లు దర్శకుడు తెలిపారు. యువత భావోద్వేగాలు, బంధాలు, వివాహంపై వారి అభిప్రాయాల చుట్టూ కథ సాగుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని రూపొందించామని, మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉందన్నారు. హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి విజయ్ సి.కుమార్ ఛాయాగ్రహణం అందించారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com